




అద్భుతం.. మాధవ రాయస్వామి ఆలయం

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం


Sunday Special

ఓ వైపు భారీ కోటగోడలు.. మరోవైపు అత్యంత లోతైన లోయ.. మధ్యలో చార్మినార్‌ను తలపించేలా జుమ్మామసీదు.. పక్కనే ధాన్యాగారం. ఎదురుగా కత్తుల కోనేరు. ఒకవైపు శిల్పుల కళానైపుణ్యం ఉట్టిపడే రంగనాథస్వామి ఆలయం.. ఇంకోవైపు ఆకాశాన్ని తాకుతుందా అన్నట్టు ఉండే మాధవరాయస్వామి ఆలయ గోపురం.. వీటన్నింటినీ మించి రెండుకొండల నడుమ లోయలో ప్రవహించే పెన్నానది.. వెరసి గండికోట జిల్లాలోనే ఓ అద్భుత పర్యాటక ప్రాంతం. ఇక్కడి కట్టడాలు వెయ్యేళ్ల చరిత్రకు నిలువెత్తు దర్పణం కాగా.. పెన్నాలోయ గ్రాండ్ కెనాన్ ఆఫ్ ఇండియాగా ఖ్యాతిగాంచింది.



# అపురూప చరిత్ర.. గండికోట

- సహజసిద్ధంగా ఏర్పడ్డ పెన్నాలోయ
- ఆకట్టుకుంటున్న మాధవరాయస్వామి ఆలయ గోపురం
- ఇప్పటికీ చెక్కుచెదరని శిల్పసంపద
- పర్యాటకులను ఆకర్షిస్తున్న మహోదుర్గం



జమ్మలమడుగు /కడప కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాటక స్థలాల్లో ముఖ్యమైనది గండికోట. దాదాపు వేయి సంవత్సరాలకు పైగా చరిత్రగల ఈ ప్రాంతం పర్యాటకులకు విశేషంగా ఆకట్టుకుంటోంది.

గండికోటను క్రీ.శ.1123 జనవరి 9న కల్యాణి చాళుక్య ప్రభువు త్రైలోక్యమల్లుడికి సామంతుడైన కాకరాజు పేరు గల సిద్ధన చోళ మహారాజు నిర్మించినట్లు నాటి శాసనాలు, కైఫీయత్తులు తదితర చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. కోటకు పడమర, ఉత్తర దిశల్లో సహజ సిద్ధంగా ఏర్పడిన లోయలో పెన్నానది ప్రవహిస్తోంది. గండికోటను చుట్టేసినట్లు ఎర్రమల కొండల మధ్య ఆ నది కనిపిస్తుంది. కాకతీయుల కాలంలో కాయస్థ అంబదేవుడు కొంతకాలం గండికోటను పాలించాడు. అనంతరం విజయనగరరాజుల పాలనలోకి వచ్చింది. మొదట బుక్కనరాయలు ఆయన కుమారుడైన ప్రౌఢదేవరాయలు పాలించారు. ఆ పరంపరలోనే ఈ కోట పెమ్మసాని వంశీకులకు లభించింది. వారు 300 ఏళ్లకు పైగా ఈ కోటను పరిపాలించారు. తరువాత గోల్కొండ నవాబు కులీకుతుబ్‌షాహి సైన్యాధికారి మీర్‌జుమ్లా 1652 ఆగస్టు 25న నాటి గండికోట పాలకుడైన పెమ్మసాని తిమ్మనాయుడు నుంచి కోటను స్వాధీనం చేసుకున్నాడు. మీర్‌జుమ్లా తరువాత గోల్కొండ సామంతులైన కడప నవాబులు ఫక్కీర్‌ఖాన్, మహ్మద్‌ఖాన్ సహా హసఫ్‌జహీలా ప్రతినిధి కవిదుల్లాఖాన్, మోచమియా, ఆయన సతీమణి మదీనాబీబీ ఆ కోటను పాలించారు. ఆ వంశీకుల పాలనలోనే ఆ కోట టిప్పుసుల్తాన్‌కు దక్కింది. అనంతరం 1791లో ఇది ఆంగ్లేయుల పాలనలోకి వచ్చింది. తదుపరి ఆ కోట ప్రాధాన్యత తగ్గిపోయింది.

### విగ్రహాలను తరలించారు..

గండికోటను 1652 ఆగస్టు 25న మీర్‌జుమ్లా స్వాధీనం చేసుకున్నారు. వీరు గండికోట లోని మాధవరాయ స్వామి ఆలయంలోకి వస్తారని తెల్సి కొందరు వీరులు పెద్దల సూచనలతో గర్భాలయం వెనుక గల కొన్ని రాళ్లను తొలగించి దేవతామూర్తుల విగ్రహాలను జాగ్రత్తగా బయటికి తరలించారు. ఆలయం వెనుక ద్వారం నుంచి పెన్నాలోయలోకి చేర్చి అక్కడి నుంచి నది ద్వారా మైదుకూరు ప్రాంతానికి చేర్పించి బావిలో దాచారు. వందేళ్ల తరువాత స్థానికులు గుర్తించి వాటిని వెలికితీసి మైదుకూరులో వాటికి ఆలయం నిర్మించారు. దీంతో గండికోటలోని మాధవరాయ స్వామి ఆలయం గర్భగుడిలో ఇప్పటికీ విగ్రహం లేదు.

### వాచ్ టవర్..

కోట ప్రధాన ద్వారం చాలా పెద్దవి. వాటిని తెరిచి మూయడానికి అప్పట్లో ఏనుగులను వాడేవారట. శత్రువుల ఏనుగులు వచ్చి తలుపులను ఢీకొనకుండా అప్పట్లోనే ఆ తలుపులకు సూది మొనల్లా ఉన్న ఇనుప గుబ్బలను ఏర్పాటు చేశారు. తలుపులు తీయకుండా లోపలికి, బయటకు వెళ్లేందుకు అనువుగా పక్కనే చిన్న ద్వారం కూడా ఏర్పాటు చేశారు. ఇలాంటి తలుపులు జిల్లాలో మరెక్కడా కనిపించవు. కోట లోపలికి వెళ్లగానే ఎత్తుగా వాచ్ టవర్

మిగతా 6వపేజీలో..

# ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులు

- రాష్ట్ర అవార్డుకు ఎంపిక

రాయచోటి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రకటించిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులలో జిల్లా నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. రాయచోటి పట్టణం దఫ్సేదార్‌పల్లె మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ షౌకత్ అలీ, కలకడ కస్తూర్బాగాంధీ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ అనిత, పెద్దమండెం మండలం కేజీబీవీలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు నాగరత్నమ్మలను ఈ అవార్డులకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ప్రతి ఏడాది సెప్టెంబరు 5వ తేదీ మాజీ రాష్ట్రపతి సర్వేపల్లె రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులను ప్రదానం చేస్తారు. అయితే ఈసారి సెప్టెంబరు నెలలో విజయవాడలో వరదలు సంభవించాయి. దీంతో ఈ కార్యక్రమాన్ని వాయిదా వేశారు. ప్రస్తుతం మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్‌కలామ్ జయంతి సందర్భంగా జాతీయ విద్యాదినోత్సవం రోజు ఈనెల 11న ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు. విజయవాడలోని లబ్బీపేటలో ఉన్న ఏ కన్వెన్షన్‌లో ఈ కార్యక్రమం జరగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అవార్డుల ప్రదానం జరగనుంది.

- 35 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న షౌకత్ అలీ.. ఇప్పటికే పలుమార్లు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు పొందారు. ఉర్దూ అకాడమీ నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందారు. సర్వీసులో ఎటువంటి మచ్చలేకుండా గ్రామీణ స్థాయిలో సమర్థవంతంగా పనిచేశారనే పేరుంది. దివంగత రామస్వామి ఆశీస్సులతో.. అక్షరరశ్మి కార్యక్రమంలో వయోజన విద్య అభివృద్ధికి సంబేపల్లె మండలంలో రాత్రి 11 గంటలకు వరకు పనిచేయడం ఎప్పటికీ మర్చిపోలేని సంఘటనగా ఆయన పేర్కొన్నారు. ఈ అవార్డు వల్ల తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు.
- కలకడ కస్తూర్బా బాలికా విద్యాలయం ప్రిన్సిపాల్‌గా అనిత పనిచేస్తున్నారు. 11 సంవత్సరాలుగా విద్యాభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ 10, ఇంటర్మీడియట్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారు. 2016లో ఉత్తమ స్పెషల్ ఆఫీసర్‌గా జిల్లా స్థాయి అవార్డును అందుకున్నారు. 2018-19, 2021-22 విద్యాసంవత్సరంలో స్వచ్ఛ విద్యాలయ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ అవార్డు ప్రకటనతో విద్యాభివృద్ధికి కృషి చేయడానికి మరింత స్ఫూర్తి కలుగుతుందని పేర్కొన్నారు.
- పెద్దమండ్యెం మండలం కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో ఇంగ్లీషు టీచర్‌గా నాగరత్నమ్మ పనిచేస్తున్నారు. 16 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ఈమెకు 2014లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది. 2018లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆంధ్రా యూనివర్సిటీలో అవార్డు అందుకున్నారు. రెండోసారి రాష్ట్ర ఉత్తమ అవార్డు రావడం సంతోషంగా ఉందని, ఈ అవార్డు రావడం పట్ల బాధ్యత పెరిగిందని అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన పై ముగ్గురినీ జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యంతో పాటు విద్యాశాఖకు చెందిన పలువురు అభినందించారు.



షౌకత్‌అలీ



అనిత



నాగరత్నమ్మ

## రైల్వేకోడూరుకు రెండు చైర్మన్ పదవులు

- అనూహ్యంగా కేకే చౌదరికి రాష్ట్ర చైర్మన్ పదవి
- అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా ముక్కా



రూపానందరెడ్డి



కేకే చౌదరి

రైల్వేకోడూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా నామినేటెడ్ పదవులను కూట మి ప్రభుత్వం శనివారం ప్రకటించింది. ఇందులో రెండు నామినేటెడ్ పదవులు రైల్వేకోడూరు అసెం బ్లీ నియోజకవర్గానికి చెందిన నాయకులకు రావ డం పట్ల కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డిని అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా నియమించారు. అలాగే చిట్వేలి మండలం కస్తూరివారిపల్లె గ్రామానికి చెందిన కేకే చౌదరిని రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల అభివృద్ధి బోర్డు చైర్మన్‌గా నియమించారు.

ఈ పదవి ఆయనకు అనూహ్యంగా లభించింది. విద్యార్థి దశ నుంచి రాజకీయాలపై మక్కువ కనబరిచారు. తర్వాత చిట్వేలి మం డల పార్టీ అధ్యక్షుడిగా, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ యువగళం కార్యక్రమానికి రూట్ మ్యాప్ కో-ఆర్డినేటర్‌గా పనిచేశారు. పార్టీకి చేసిన సేవలను కూటమి ప్రభుత్వం గుర్తించింది. సామాన్య కార్యకర్త నుంచి రాష్ట్ర ఖాదీ పరిశ్రమల బోర్డు చైర్మన్ వరకు పదవి సాధించడంతో యువతకు మంచి పట్టు లభిస్తుందని రైల్వేకోడూరు నియోజకవర్గంలోని నాయకులు అంటున్నారు.



వీఆర్వో శేఖర్ నివాసం వద్ద కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ సీఐ మోహన్‌ప్రసాద్

## మదనపల్లెలో ఏసీబీ సోదాలు

- పూర్వపు ఆర్డీవో మురళిపై అక్రమాస్తుల కేసు
- ఆర్డీవో తమ్ముడు, అనుచరుడి ఇళ్లల్లో తనిఖీలు

మదనపల్లె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పూర్వపు ఆర్డీవో ఎం.ఎస్.మురళి ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న అభియోగంపై మదనపల్లెలో ఏసీబీ పోలీసులు సోదాలు నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని ఆర్డీవో మురళి తమ్ముడు వెంకటాచలపతి నివాసంలో, ఆర్డీవో ప్రధాన అనుచరుడిగా పేరున్న మదనపల్లె మండలం పొన్నేటిపాళెం వీఆర్వో ఎస్.శేఖర్ నివాసంలో సోదాలు చేపట్టారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జూలై 21వ తేదీ జరిగిన ఫైళ్ల దహనం కేసులో ఆర్డీవో మురళి నిందితుడిగా ఉంటూ సస్పెండ్‌కు గురైన విషయం తెలిసింది. అప్పటి నుంచి ఆయన తిరుపతిలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో తిరుపతిలోని మురళి ఇంట్లో, ఆయన కుమారుడి ఇంట్లో, మరోవైపు ఆయనకు చెందిన లాడ్జీ, హోటల్‌లో ఏసీబీ అధికారులు తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా తిరుపతి, మదనపల్లెతో పాటు మురళి స్వగ్రామం చిత్తూరు జిల్లా వి.కోటలోనూ ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారంటూ తిరుపతి ఏసీబీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో భాగంగా ఆర్డీవోగా పనిచేసిన ప్రాంతాల్లో, ఆయనకు ప్రధాన అనుచరులు, బంధువుల ఇళ్లలో సోదాలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో శనివారం తిరుపతి ఏసీబీ డీఎస్పీ ప్రశాంతి ఆదేశాల మేరకు మదనపల్లెలో ఈ రెండు చోట్లా రెండు బృందాలు తనిఖీలు చేసినట్లు ఏసీబీ సీఐ మోహన్‌ప్రసాద్ మీడియాకు తెలిపారు. అలాగే ప్రశాంత్‌నగర్‌లో మురళికి చెందిన భవనంలో ఆయన తమ్ముడు ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్న వెంకటాచలపతి నివాసం ఉంటున్నారు. అక్కడ కూడా అనంతపురానికి చెందిన ఏసీబీ సీఐ హేమంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలోని బృందం ఉదయం నుంచి సాయంత్రం వరకూ సోదాలు చేశారు. మురళి కేసుకు సంబంధించి ఏడు బృందాలు ఏర్పాటు అయినట్లు తెలిపారు. ఆయన పనిచేసిన చోటా, ఆయన ప్రధాన అనుచరులు, బినామీ పేర్లతో ఆస్తులు ఉండవచ్చుననే అనుమానం ఉన్న ప్రతిచోటా ఈ బృందాలు సోదాలు చేస్తాయని తెలిపారు. ఇందులో భాగంగా కురవంకలోని వీఆర్వో శేఖర్ ఇంట్లో సోదాలు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. గతంలో మురళి ఆర్డీవోగా ఉన్నచోట శేఖర్ పనిచేశారని, ఆయన కుటుంబ వ్యవహారాల్లో సన్నిహితంగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇందులో భాగంగా బినామీ పేరుతో ఆస్తులు, ఇతర లావాదేవీలు కలిగి ఉన్నారేమోనన్న అనుమానంతో సోదాలు చేసినట్లు తెలిపారు. ఇక్కడ ఏమి స్వాధీనం చేసుకున్నారని మీడియా ప్రశ్నించగా అదంతా విచారణకు సంబంధించిన విషయమని చెప్పడానికి సీఐ నిరాకరించారు.


## మహారాష్ట్ర నుంచి తిరుమలకు

- సైకిల్‌పై వెళుతున్న భక్తులు
- మహారాష్ట్ర-తిరుమలకు 900 కిలోమీటర్లు దూరం



తిరుమలకు సైకిల్‌పై వెళుతున్న మహారాష్ట్ర భక్తులు

ములకలచెరువు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి తిరుమలకు భక్తులు సైకిల్‌పై వెళుతున్నారు. మహారాష్ట్ర రాష్ట్రం విట నుంచి భక్తులు అమూల్, షాజీ, సతీశ్ ఈనెల 1వ తేదీన సైకిళ్లపై తిరుమలకు బయలుదేరారు. ఈ క్రమంలో వీరు శనివారం మార్గమధ్యంలోని ములకలచెరువుకు చేరుకుని ఇక్కడ కొంతసేపు సేదతీరారు. మొక్కుబడి తీర్చుకునేందుకు వెంకటేశ్వరస్వామి దర్శనార్థం సైకిళ్లపై తిరుమలకు వెళుతున్నామని తెలిపారు. మొత్తం ముగ్గురు భక్తులు సైకిళ్లపై వెళుతుండగా ఒకరు ముందుగా వెళ్లిపోయారు. కాగా మహారాష్ట్ర రాష్ట్రం విట నుంచి తిరుమలకు 900 కిలోమీటర్ల దూరం ఉంటుందని చెప్పారు.




సైకిల్‌పై ఉన్న పోస్టరు

# ఆశచూపి ఆలస్యం చేస్తున్నారు..

- డబ్బులు కట్టినా ఫలితం శూన్యం
- రిజిస్ట్రేషన్‌తో సరిపెట్టుకున్న వైనం
- ఎంఐజీ లేఅవుట్‌లో నిలువెత్తు నిర్లక్ష్యం

జిల్లా కేంద్రం.. పైగా భూముల రేట్లు ఆకాశాన్ని అంటాయి. సామాన్యుడు స్థలం కొని ఇల్లు కట్టే పరిస్థితి లేదు.. దీంతో మధ్య తరగతి ఉద్యోగుల కోసం వైసీపీ ప్రభుత్వం ఎంఐజీ లేవుట్ పేరుతో ప్లాట్లు వేసింది. దీంతో బయట కోట్లాది రూపాయలు పెట్టి స్థలాలు కొనలేని టీచర్లు, చిన్నపాటి ప్రభుత్వ ఉద్యోగులు, అటెండర్లు తక్కువ ధరకు వస్తోందన్న ఆశతో అక్కడ ప్లాట్లు కొన్నారు. వారి పేరుతో రిజిస్ట్రేషన్లు కూడా పూర్తి చేసింది. అయితే ఆ ప్లాట్లు మాత్రం లబ్ధిదారులకు ఇంతవరకు చూపించలేదు. దీంతో లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా వారి బాధను ఎవరూ పట్టించుకోవడం లేదు.



దిగువ అబ్బవరం దగ్గర వేసిన ఎంఐజీ లేఅవుట్

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ఏర్పడటం.. జిల్లా కేంద్రంగా రాయచోటిని ప్రకటించడంతో రాయచోటి చుట్టుపక్కల ఉండే భూముల ధరలు ఆకాశాన్ని అంటాయి. ఈ విషయాన్ని పసిగట్టిన అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వారు ఇదే అదునుగా తీసుకుని వారు కూడా మధ్య తరగతి ఉద్యోగులకు ఆశ చూపి లక్షలాది రూపాయలు డబ్బులు కట్టించుకుని రిజిస్ట్రేషన్లు కూడా చేయించి స్థలం చూపించకుండా లబ్ధిదారులకు చుక్కలు చూపిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో చేసిన ఈ వ్యవహారం అన్నమయ్య జిల్లాలో లబ్ధిదారులకు దిక్కుదోచని పరిస్థితి ఏర్పడింది. అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వారు రాయచోటి మండలం దిగువ అబ్బవరంలో దాదాపు 30 ఎకరాల్లో 240 ప్లాట్లు వేసి రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. అయితే ఒక్కొక్క ప్లాటుకు 8 లక్షల నుంచి 15 లక్షల రూపాయల వరకు వసూలు చేసి లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు కూడా ఇచ్చారు. ఆ తర్వాత వారికి తమ ప్లాటు ఎక్కడుందో చూపకుండా మొహం చాటేసుకొని వెళ్లిపోయారని లబ్ధిదారులు వాపోతున్నారు. ఈ వ్యవహారం అంతా జరిగి దాదాపు ఒకటిన్నర సంవత్సరం కావస్తున్నా ఇప్పటి వరకు స్థలాలు చూపించకపోవడంతో లబ్ధిదారుల్లో పలు అనుమానాలు కలుగుతున్నాయి. కలెక్టర్ కార్యాలయానికి రెండు కిలోమీటర్ల సమీపంలో ఈ లేఅవుట్ వేసి అందరికీ అందుబాటులో ఉండే విధంగా అన్ని రకాల హంగులతో తీర్చిదిద్దుతామని చెప్పిన అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వారు ఆ రకంగా చర్యలు తీసుకోకపోవడంపై లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వారు ఎంఐజీ లేఅవుట్‌లో రిజిస్ట్రేషన్ చేసిన లబ్ధిదారులకు ప్లాట్లు చూపించాలని కోరుతున్నారు. ఈ విషయంపై అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వారిని వివరణ కోరగా వారు మాకు సంబంధం లేదు కడప జిల్లా జాయింట్ కలెక్టర్‌ను వెళ్లి అడగండి అని జారుకుంటున్నారు.

### ఒత్తిడి చేసి డబ్బులు కట్టించుకున్నారు..



జిల్లా ఏర్పడిన కొత్తలో రాయచోటి పట్టణం చుట్టుపక్కల ఉన్న భూములకు విపరీతమైన ధరలు పెరగడంతో బయట స్థలం కొనే స్థోమత లేక అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వారు వేస్తున్న ఎంఐజీ లేఅవుట్‌లో రూ.15 లక్షలు పెట్టి కొన్నాము. వారు కూడా రిజిస్ట్రేషన్ చేయించారు. అయితే మాకు ఇంతవరకు స్థలం ఎక్కడుందో చూపించకపోవడం బాధా కరం. మేము చాలా ఇబ్బందులు పడి డబ్బులు కట్టాము. అయినా వారికి కనికరం లేదు. మేము కట్టిన డబ్బులకు ప్లాట్ ఎక్కడుందో చూపిస్తే బాగుంటుంది.

- గురునాథ, టీచర్, రాయచోటి

### బాధ్యతలు మరిచిపోయారు..



అన్నమయ్య అర్బర్ డెవలప్‌మెంట్ అథారిటీ వారు డబ్బులు కట్టించుకున్నంత బాధ్యతగా స్థలం చూపించడంలో వారు బాధ్యతలు మరిచిపోయారు. లక్షలాది రూపాయలు డబ్బులు కట్టి ఒకటిన్నర సంవత్సరం అవుతున్నా ఇప్పటి వరకు స్థలం చూపించలేదు. అంటే దీని వెనుక ఏదో మతలబు జరుగుతోందని మాకు అర్థమైంది. రిజిస్ట్రేషన్లు మాత్రమే చేయించి స్థలాలు చూపించకుండా వారు వెళ్లిపోయారు. ఈ పద్ధతి ఏం బాగోలేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఈ విషయంలో చొరవ చూపించి లబ్ధిదారులకు ప్లాట్లు ఎక్కడున్నాయో చూపించాలి.

- ముల్లా, టీచర్, కడప

## నేటి నుంచి కడపలో..
## అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

- సిద్ధమైన డీఎస్ఏ స్టేడియం
- ర్యాలీకి 13 జిల్లాల నుంచి 4,000 మంది అభ్యర్థుల రాక
- ప్రతీ రోజు 800 మందికి స్ర్కీనింగ్ టెస్ట్

6



ర్యాలీ కోసం కడపలోని డీఎస్ఏ స్టేడియంలో చేసిన ఏర్పాట్లు

# అపురూప చరిత్ర.. గండికోట

● సహజసిద్ధంగా ఏర్పడ్డ పెన్నాలోయ ● ఆకట్టుకుంటున్న మాధవరాయ స్వామి ఆలయ గోపురం ● ఇప్పటికీ చెక్కుచెదరని శిల్పసంపద ● పర్యాటకులను ఆకర్షిస్తున్న మహాదుర్గం


వాచ్‌టవర్


గండికోట ముఖద్వారం


గండికోటలోని రంగనాథస్వామి ఆలయం


చార్‌మినార్

(5వపేజీ తరువాయి)

దర్శనమిస్తుంది. 16వ శతాబ్దంలో అప్పటి నవాబులు దీనిని నిర్మించారు. శత్రువుల రాకపోకలను దాని పైకి ఎక్కి దూరం నుంచి చూసే సౌకర్యం కోసం ఏర్పాటు చేశారు. 400 సంవత్సరాలు అయినా నేటికీ చెక్కుచెదరలేదు. అప్పట్లో తప్పు చేసిన ఖైదీలకు వివిధ రకాల శిక్షలు ఉండేవి. శిక్ష పడిన వారిని నిర్బంధించేందుకు విడిగా కారాగారం ఉంది.

### ఆకట్టుకుంటున్న మాధవరాయస్వామి ఆలయం

కోట లోపల గల మాధవరాయస్వామి ఆలయ రాజగోపురం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఇప్పటికే అక్కడ చాలా సినిమాలు, షూటింగ్‌లు కూడా జరిగాయి. అప్పట్లో శత్రువుల దాడిలో కొద్ది భాగం ధ్వంసమైంది. గోపురం కింద గల ద్వారం పైన ఇటు లోపలికి వెళ్లేవారికి, అటు లోపల నుంచి బయటికి వచ్చేవారికి స్వాగతం చెబుతున్నట్లుగా నృత్య భంగిమల చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. వెయ్యేళ్ల కిందటి నాటి సంస్కృతి సంప్రదాయాలను ఆ శిల్పాల్లో నేటికీ చూడవచ్చు. గోపురం లోపల రెండు వైపులా అద్భుతమైన శిల్ప సంపద కనిపిస్తుంది. ఇనుప స్వభావం గల పెద్ద పెద్ద రాతిబండల స్తంభాలతో ఉన్న ఆ ఆలయం ఎంతటి ఎండలో అయినా చల్లగా ఉండటం విశేషం. దానిని దాటి లోపలికి వెళ్లామంటే విశాలమైన హాలులో మండపం ఉంది. అందులో కళాప్రదర్శనలు జరిగేవి. అంతేకాకుండా ఏదేని వివాదాలు, వాటి విచారణలు కూడా అక్కడే జరిగేవి. గండికోట లోపల మరో విశేషం రంగనాథస్వామి ఆలయం. ఆలయం అన్ని వైపులా అపురూపమైన శిల్పసంపద దర్శనమిస్తుంది. ఆలయం లోపల వైష్ణవ సంప్రదాయం ప్రకారంగా ముఖమండపం, రంగమండపం, అంతరాలయం, గర్భాలయం, యాగశాల దర్శనమిస్తాయి. ప్రధానంగా రంగమండపంలో కూడా ప్రతి స్తంభంలో అద్భుతమైన శిల్పాలు చెక్కారు.

### ఆశ్చర్యంగొల్పే శిల్పుల నైపుణ్యం

కోటలోపల గల మాధవరాయస్వామి ఆలయంలో ఒక శిల్పం నేటికీ పర్యాటకులకు ఆశ్చర్యం కలిగిస్తుంటుంది. ఆ శిల్పం ఓ వైపు నుంచి చూస్తే వృషభంలా, మరో వైపు నుంచి ఏనుగులా కనిపిస్తుంది. వాటి రెండింటికీ గల శరీరాలు వేరుగా ఉంటూనే తల మాత్రం ఒకటిగానే ఉంటుంది. ఏనుగు తలను మూసి చూస్తే ఎద్దులా కనిపిస్తుంది, ఎద్దు తలను మూసి చూస్తే ఏనుగులా కనిపిస్తుంది. అప్పట్లోనే నాటి శిల్పుల చాతుర్యాన్ని దీనిని చూస్తే అర్థమవుతుంది.

### పటిష్టంగా నేటికీ వసారా

ఆలయం వెనుక గల మూడు వైపులా వసారా గదులు నేటికీ పటిష్టంగానే దర్శనమిస్తున్నాయి. ప్రాకారం లోపల (పాకశాల - వంటశాల అలంకార శాల) ఉన్నాయి. వెనుకభాగాన కల్యాణ మండపం, ఉత్తరం వైపున ఆళ్వార్ల మండపాలు ఉన్నాయి. చుట్టూ మూడువైపులా మొత్తంగా 56 స్తంభాల వసారా ఉంది. అన్ని స్తంభాలతో పాటు పైకప్పులో కూడా శిల్పాలు దర్శనమిస్తాయి.

### అందమైన ఆకృతిలో జుమ్మామసీదు

గండికోట లోపల ఉత్తరం వైపున అందమైన జుమ్మా మసీదు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. మసీదు లోపల 64, వెలుపల 32 గదుల వసారాలు ఉన్నాయి. వెలుపల గదిలో గుర్రాలను అప్పట్లో ఉంచేవారు. లోపల సైనికులు, సామంతరాజులు సభ చేసేవారు. రాజపీఠం స్థానంలో అందమైన మసీదు నిర్మించారు. ఎత్తయిన అరుగుపై ఉజూఖానా కూడా ఉంది. ఉత్తరం వైపు దిశగా వెళితే మసీదు పైకి మెట్లు ఉన్నాయి. ఎదురుగా నిలబడి మసీదును చూస్తే హైదరాబాదులో గల చార్మినార్ గుర్తుకు వస్తుంది.

**ఇలా చేరుకోవచ్చు..**

గండికోట జమ్మలమడుగు పట్టణానికి 14 కి.మీ దూరంలో ఉంది. కడప నుంచి కానీ, ప్రొద్దుటూరు నుంచి కానీ జమ్మలమడుగు వెళ్లి అక్కడి నుంచి గండికోట చేరుకోవచ్చు. గండికోట నుంచి ఆటోలు ఉంటాయి.

### కత్తుల కోనేరు

జుమ్మామసీదుకు ఎదురుగా కోనేరు ఉంది. దీనిని కత్తుల కోనేరు అంటారు. యుద్ధాలు చేసి వచ్చాక సైనికులు ఇక్కడ కత్తులను శుభ్రం చేసుకునే వారని అంటారు. ఇప్పటికీ కోనేరులో నీళ్లు ఉన్నాయి.

### పటిష్ట ధాన్యాగారం


జుమ్మా మసీదుకు పక్కనే ధాన్యాగారం ఉంది. దీనిని 12 స్తంభాలతో పటిష్టంగా నిర్మించారు. గండికోటను పాలించిన రాజుల్లో ఒకరైన మీర్‌జుమ్లా 16వ శతాబ్దంలో ఆ భవనాన్ని అత్యంత సుందర ధాన్యాగారంగా నిర్మించారు. ధాన్యం బస్తాలను సులభంగా తీసుకోవడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అప్పట్లోనే ఏర్పాటు చేసుకున్నారు. అందులో ఉంచిన ధాన్యం రెండేళ్ల పాటు పాడవకుండా ఉండేలా నిర్మించడం విశేషం. దాని పైకి వెళ్లడానికి ఉత్తరం వైపు నుంచి మెట్లు అమర్చారు. పై నుంచి చూస్తే జుమ్మామసీదు, కోటలోని మరికొన్ని ప్రాంతాలు కనిపిస్తాయి.

### కొండను రెండుగా చీలుస్తూ.. పెన్నానది

ఆలయం పక్కనే పెన్నాలోయ ఉంది. దీనినే గండికోట లోయ అని కూడా అంటారు. రెండు కొండలను చీలుస్తూ పెన్నా నది ప్రవహిస్తుంటుంది. వాస్తవానికి ఇక్కడ నదిలో నీళ్ల వేల సంవత్సరాలుగా ప్రవహించడం వలన కోతకు గురై అటు ఇటు కొండలుగా.. లోయలో నది ఉన్నట్టు ఉంటుంది. ప్రపంచంలో ఇలాంటి ప్రదేశం అమెరికాలోని గ్రాండ్ కెనాన్ మినహా మరెక్కడా లేదు. ఇలాంటి అద్భుతమైన లోయ ప్రపంచంలో ఇది రెండోది. అదుకే దీనిని గ్రాండ్ కెనాన్ ఆఫ్ ఇండియా అంటారు. ఈ ప్రాంతం పర్యాటకంగా ప్రాచుర్యంలోకి రావడానికి కూడా లోయే కారణం.


**రోప్‌వే ఏర్పాటు చేస్తే..**


గండికోట పెన్నానది లోయ అందాల సొగసులను మరింత ఆస్వాదించేందుకు అనువుగా రోప్‌వే సౌకర్యం కల్పిస్తే పర్యాటకుల సందడి మరింత పెరిగే అవకాశం ఉంది. తద్వారా ప్రభుత్వానికి మరింత ఆదాయం సమకూరే సౌలభ్యం ఉంటుంది. ఆ దిశగా పాలక ప్రభుత్వాలు స్పందించి రోప్‌వే సౌకర్యం ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇక్కడ బస చేయడానికి హరిత రెస్టారెంట్ ఉంది. ఇటీవల కొన్ని ప్రైవేటు గెస్ట్ హౌస్‌లు ఏర్పాటు చేశారు.


గుర్రాలశాల


కత్తుల కోనేరు


ధాన్యాగారం


మాధవరాయస్వామి ఆలయం


కొండను రెండుగా చీలుస్తూ ప్రవహిస్తున్న పెన్నానది

## విద్యార్థుల స్కూల్ రికార్డులు సరిదిద్దే
# అధికారం బదలాయింపు

**ఇక నుంచి డీవైఈవో, ఎంఈవో, హెచ్‌ఎంలకు అధికారం**

కలికిరి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల స్కూల్ రికార్డుల్లో తప్పులను లేదా సవరణలు చేసే అధికారాన్ని స్థానిక డిప్యూటీ విద్యా శాఖాధికారి (డీవైఈవో), ఎంఈవోలు, హెడ్మాస్టర్లకు బదలాయిస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరు విజయరామరాజు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇలాంటి సవరణల ఆమోదం తెలిపే అధికారం జిల్లా విద్యా శాఖాధికారులు, రీజినల్ జాయింట్ డైరెక్టర్లకు మాత్రమే ఉండేది. 'ఒకే దేశం.. ఒకే విద్యార్థి' అన్న నినాదంతో 'అపార్' ఐడీలు జారీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ఐడీల జారీ కోసం పాఠశాలల రికార్డుల్లో విద్యార్థులకు సంబంధించిన పలు అంశాలపై తప్పులు చోటు చేసుకున్నాయి. వీటిని సవరిస్తేగానీ ఆధార్ సవరణలకు వీలుకాదు. పూర్తి పక్కా సమాచారంతో ఆధార్ అప్‌డేట్ జరిగితే అపార్ ఐడీ జారీ సాధ్యమవుతుంది. ఈ నేపథ్యంలో స్కూల్ రికార్డుల్లో సవరణలను ఆమోదించుకోవడం కోసం డీఈవో, ఆర్జేడీ కార్యాలయాలకు వెళ్లడం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు భారంగా పరిణమించిందని డైరెక్టరు పేర్కొన్నారు. సవరణల ప్రక్రియను సులభతరం చేసేందుకు స్థానిక విద్యా శాఖ అధికారులకు సవరణలను ధ్రువీకరించే అధికారాన్ని బదిలీ చేసినట్లు తెలిపారు. 2025 మార్చి 31వ తేదీ వరకు మాత్రమే ఈ అధికారాన్ని పరిమితం చేస్తున్నట్లు డైరెక్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ విద్యార్థుల స్కూల్ రికార్డులను సరిచేయడానికి ఎంఈవోలకు అధికారం కల్పించారు. అదే ప్రభుత్వ, జడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థుల రికార్డుల సవరణకు ఆయా హెడ్‌మాస్టర్లకు అప్పగించారు. ఇక మిగిలిన ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు సంబంధించిన వ్యవహారాలకు డీవైఈవోలకు అధికారం కల్పించారు. అయితే రికార్డుల సవరణల్లో ఏవైనా అవకతవకలతో తారుమారు జరిగినట్లయితే కఠిన చర్యలకు గురవుతారని కూడా ఈ ఉత్తర్వుల్లో హెచ్చరించారు.

# అవినీతికి పాల్పడితే చర్యలు

● సచివాలయాలు, మీ-సేవ కేంద్రాల్లో తనిఖీ
● మున్సిపల్ కార్యాలయంలో కౌంటర్ ఏర్పాటు
● మున్సిపల్ కమిషనర్ ప్రమీల చర్యలు



మున్సిపల్ మేనేజర్ మనోహర్‌తో చర్చిస్తున్న కమిషనర్ ప్రమీల, మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రం

మదనపల్లె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకొస్తున్న అపార్ ఐడీల కోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల సిబ్బందిని హెచ్చరించారు. 'బర్త్ సర్టిఫికెట్ల కోసం వసూళ్లు' అనే శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. దీనికి స్పందించిన మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఏఎస్‌వో వెంకటేష్‌నాయుడు తీవ్రంగా స్పందించారు. వసూళ్లపై అభియోగాలు, ఆరోపణలు వచ్చిన సచివాయాలు, మీ-సేవా కేంద్రాలను తనిఖీ చేశారు. బర్త్ సర్టిఫికెట్ల సవరణ కోసం వచ్చే ప్రజలతో కమిషనర్ మాట్లాడారు. మరోవైపు సచివాలయాలకు నియమించిన నోడల్ ఆఫీసర్లను సాధారణ పౌరులుగా పంపించి వాకబు చేయించారు. ఇక్కడ ఒక్కో సర్వీసుకు ఎంత తీసుకుంటారు? ఈ విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కమిషనర్‌తో పాటు నోడల్ ఆఫీసర్లు వేర్వేరుగా వారిని ఆరా తీశారు. ఒక్కో సర్వీసుకు నిర్ణీత రుసుం కంటే ఒక్క రూపాయి అదనంగా తీసుకున్నా తనకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. అలాగే మరోసారి ఇలాంటి ఫిర్యాదులు వస్తే అక్కడిక్కడే కఠినమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులను తీవ్రంగా హెచ్చరించారు. అలాగే మరికొందరు మీ-సేవా కేంద్రాల నిర్వాహకులను మున్సిపల్ కార్యాలయానికి పిలిపించి విచారించడంతో పాటు అభియోగం, ఫిర్యాదులు వచ్చిన వారిని తీవ్రంగా హెచ్చరించారు. అలాగే సచివాలయ అమ్యునిటీ, డిజిటల్ అసిస్టెంట్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి ముఖ్యంగా జనన ధ్రువీకరణ పత్రంలో సవరణలను వెంటనే, అక్కడిక్కడే నమోదు చేసి పరిష్కరించాలని సూచించారు. ఈ విషయంలో ప్రభుత్వం, కలెక్టర్ చాలా సీరియస్‌గా ఉన్నట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. మున్సిపాలిటీనే కాకుండా డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి చాలామంది వస్తున్నారని, వీరిని కొన్ని సచివాలయాలకే పరిమితం చేయకుండా, ఆయా పరిధిలోని అన్ని సచివాలయాలకు వెళ్లేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా శని, ఆదివారం కూడా పనిచేసేలా మున్సిపల్ కార్యాలయంలో కేంద్రాన్ని ప్రారంభించారు. అప్పటికీ సమస్యలు ఉంటే జనన ధ్రువీకరణ పత్రాల సవరణకు మున్సిపల్ కార్యాలయంలోనే ప్రత్యేకంగా నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేయాలని మేనేజర్ పి.ఆర్.మనోహర్‌కు సూచించారు. ఇందుకోసం శనివారం కార్యాలయానికి సెలవు అయినా ఆఫీసులో మేనేజర్‌తో సమావేశమై మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసి వివరాలు నమోదు చేయించారు.

**నేటి నుంచి కడపలో**
# అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

● సిద్ధమైన డీఎస్‌ఏ స్టేడియం ● ర్యాలీకి 13 జిల్లాల నుంచి 4 వేల మంది అభ్యర్థుల రాక ● ప్రతిరోజు 800 మందికి స్ర్కీనింగ్ టెస్ట్

కడప స్పోర్ట్స్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశ సేవలో తరించేందుకు 'అగ్నివీరులు' కావాలని ఎదురుచూస్తున్న యువత లక్ష్యం చేరుకునే సమయం ఎట్టకేలకు ఆసన్నమైంది. ఆదివారం నుంచి 15వ తేదీ శుక్రవారం వరకు కడప నగరంలోని డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ (డీఎస్ఏ) మైదానంలో అత్యంత పకడ్బందీగా అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరగనుంది. అందుకు వీలుగా మైదానంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భరతమాత ముద్దుబిడ్డలు (సైనికులు)గా దేశం కోసం సేవలందించాలనే యువతకు ఈ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఒక గొప్ప అవకాశం అని చెప్పవచ్చు. ర్యాలీలో ఎంపిక కావాలనే ధ్యేయంతో ఇప్పటికే రన్నింగ్ ప్రాక్టీస్‌తో పాటు అందుకు అవసరమైన కసరత్తుతో ఇప్పటికే యువకులు సన్నద్ధమై ఉంటారు. ఏదిఏమైనా రిక్రూట్‌మెంట్ ర్యాలీలో తమను తాము నిరూపించుకోడానికి పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించక తప్పదు.

### రోజూ 800 మందికి స్ర్కీనింగ్ టెస్ట్

కడపలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి 13 జిల్లాల నుంచి సుమారు 4 వేల మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. ఆ మేరకు కడప జిల్లాతో పాటు అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి హాజరు కానున్నారు. వీరిలో రోజుకు 800 మంది అభ్యర్థులకు స్ర్కీనింగ్ టెస్ట్ నిర్వహించేందుకు అనువుగా సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ముందస్తుగా అభ్యర్థులకు కాల్ లెటర్స్ పంపించారు. వాటిలో పొందుపరచిన తేదీ... సూచించిన సమయానికి అభ్యర్థి తప్పనిసరిగా హాజరై రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. అందులో ఏ రోజైతే కేటాయించారో అదేరోజు తప్పక హాజరుకావాలి. ఆరోజు హాజరుకాకపోతే ఇక ఎట్టి పరిస్థితిలోనూ ర్యాలీలో పాల్గొనడానికి అనుమతించరు.

వసతి, భోజన ఏర్పాట్లు సిద్ధం

ర్యాలీలో పాల్గొనేందుకు దూర ప్రాంతాల నుంచి ముందుగా వచ్చే అభ్యర్థులకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. వీరు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా గుడారాలు వేశారు. వాటిల్లో సేదతీరి ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొనవచ్చు. దూరం నుంచి ప్రయాణం చేసి ర్యాలీలో పాల్గొనే సమయానికి హాజరయ్యే అభ్యర్థులు అలసటకు గురయ్యే వీలుంది. ముందుగానే వచ్చి ఇక్కడ సేద తీరి ర్యాలీలో పాల్గొనవచ్చు. ఇదిలావుండగా కొంతమంది అభ్యర్థులకు అర్ధరాత్రి సమయంలో ర్యాలీ కేటాయించినట్లు తెలిసింది. అలాంటి అభ్యర్థులు ముందురోజు రాత్రికే కడప చేరుకోవడం ఉత్తమం. అలాంటి వారిని దృష్టిలో ఉంచుకుని భోజన వసతిని ఏర్పాటు చేశారు.

**దళారులను నమ్మి మోసపోకండి**

అత్యంత ప్రతిష్ఠాత్మకంగా కడపలో చేపడుతున్న అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇందులో పాల్గొనే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాం. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మాయమాటలు చెప్పే దళారులను నమ్మి మోసపోకండి.

– పునీత్‌కుమార్, ఆర్మీ రిక్రూట్‌మెంట్ డైరెక్టర్

### మెయిన్ గేట్ వద్దే రిజిస్ట్రేషన్

ర్యాలీలో పాల్గొనే అభ్యర్థులు ముందస్తుగా వారి తాలూకు వివరాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంది. ఈ ప్రక్రియను డీఎస్ఏ మైదానం మెయిన్ గేట్ కుడివైపున ఉన్న వాటర్ ట్యాంక్ సమీపంలో చేయనున్నారు. తదుపరి ఆర్మీ అధికారుల సూచనలను పాటించాల్సి ఉంటుంది.

### ఇండోర్ స్టేడియంలో మెడికల్ టెస్ట్

ఆర్మీ ర్యాలీలో నిర్వహించిన అన్ని పరీక్షలలో విజయవంతంగా ఉత్తీర్ణులైన అభ్యర్థులకు అక్కడే ఉన్న ఇండోర్ స్టేడియంలో మెడికల్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా ర్యాలీలో పాల్గొనే అభ్యర్థులు ఏదేని అస్వస్థతకు గురైనా, లేదా గాయాలపాలైనా అక్కడే ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో సేవలందిస్తారు.

### ర్యాలీలో పాల్గొనే అభ్యర్థులకు బస ఏర్పాటు

ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనే అభ్యర్థుల సౌకర్యం కోసం కలెక్టరు శ్రీధర్ ఆదేశాల మేరకు శంకరాపురం వద్ద ఉన్న స్కాట్ హాలులో బస ఏర్పాటు చేశామని నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



రిక్రూట్‌మెంట్ ర్యాలీ కోసం డీఎస్ఏ స్టేడియంలో చేపట్టిన ఏర్పాట్లు, ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆర్మీ అధికారులు

# చేనేత కార్మికుడి ఆత్మహత్య


మృతుడు హరి (ఫైల్)

మదనపల్లె అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలోని మారుతీనగర్‌లో ఉంటున్న చేనేత కార్మికుడు తాను నేసే చేనేత మగ్గానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాల మేరకు సత్యసాయి జిల్లా సోమందేపల్లెకి చెందిన సి.హరి (45) కొన్నేళ్లుగా మదనపల్లెకు వలసవచ్చి నీరుగట్టువారిపల్లెలో చేనేత మగ్గాల యాజమాని వద్ద కూలీ మగ్గం నేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో జీవితంపై విరక్తి చెంది తాను నేసే మగ్గానికే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు, ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి కొడుకు చరణ్ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

● చెరువును పరిశీలించిన తహసీల్దార్


చెరువులో ఇసుక గుంతలను పరిశీలిస్తున్న తహశీల్దార్

గుర్రంకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తరిగొండ రామానాయుని చెరువులో ఇసుకను టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లతో అక్రమంగా తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తామని శనివారం తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆంధ్రజ్యోతిలో 'రెచ్చిపోతున్న ఇసుక మాఫియా' అన్న శీర్షిక ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన తహసీల్దార్ రామానాయుని చెరువులో ఇసుక తవ్వకాలను పరిశీలించారు.

చెరువులో ఇసుక కోసం ఇసుకాసురులు ఎక్స్‌కవేటర్లతో తవ్విన ఇసుక గుంతలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామానాయుని చెరువులో ఇసుకను ప్రజలు, స్థానికులు తమ వ్యక్తిగత అవసరాల కోసం మాత్రమే తోలుకోవాలన్నారు. అలాకాకుండా ఎక్స్‌కవేటర్లు పెట్టి టిప్పర్లతో ఇసుకను బయట ప్రాంతాలకు తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఇందుకోసం ప్రతిరోజూ వీఆర్‌ఏను చెరువు వద్ద కాపలాగా ఉంచుతున్నట్లు తెలిపారు. ఇసుకాసురుల అగడాలను ఉపేక్షించమని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు భరత్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆస్పత్రి నుంచి విద్యార్థులు డిశ్చార్జి

### వైద్య ఖర్చులకు ఎమ్మెల్యే ఆది ఆర్థిక సహాయం



ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అవుతున్న వర్షిణి

కొండాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాముకాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొండాపురం గురుకుల పాఠశాల విద్యార్థినులు శనివారం సాయంత్రం డిశ్చార్జి అయినట్లు ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి తెలిపారు. సోమవారం తెల్లవారుజామున గదిలో నిద్రిస్తున్న వర్షిణి, పల్లవి పాముకాటుకు గురైన సంగతి తెలిసిందే. వర్షిణిని ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించగా, పల్లవిని కడప రిమ్స్‌లో చేర్చారు. వర్షిణి పరిస్థితి కొంత సీరియస్‌గా ఉండడంతో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్‌ఖ/సూచించారు. విద్యార్థుల తల్లి దండ్రులకు ధైర్యం చెప్పారు. వైద్య ఖర్చుల నిమిత్తం తక్షణమే రూ.50 వేలు అందించి మిగిలిన డబ్బు కూడా చెల్లిస్తానని తెలిపారు. ఆరు రోజుల చికిత్స అనంతరం కోలుకోవడంతో ఇద్దరు విద్యార్థులను శనివారం సాయింత్రం వైద్యులు డిశ్చార్జి చేశారు. ఆరు రోజల పాటు వర్షిణి దగ్గరే ప్రిన్సిపాల్ ఉండి పర్యవేక్షించినట్లు తెలిపారు. విద్యార్థులు క్షేమంగా బయటపడటానికి సహకరించిన ఎమ్మెల్యేకి విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రిన్సిపాల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తే అవమానిస్తారా

### - టీడీపీ నేత హరిప్రసాద్



విలేకరులతో మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే ఎమ్మెల్యేను అవమానిస్తారా అంటూ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మేయరు మహిళలను కించపరిచేలా వ్యవహరించారన్నారు. కొత్తగా ప్రొటోకాల్ డ్రామాకు తెరలేపారన్నారు. గతంలో వైసీపీ ఎమ్మెల్యేలను పక్కన కూర్చోబెట్టుకుని ఇప్పుడు ప్రొటోకాల్ అనడం ఏమిటని ప్రశ్నించారు. వైసీపీలో ఒక పెద్దమనిషి ఎన్నికల్లో డబ్బు తీసుకున్నాడని చెబితే మేయరు ఎందుకు దేవుని కడపలో ప్రమాణం చేశారని ప్రశ్నించారు. సమావేశంలో అఖిలపక్షం నేతలు శ్రీనివాసులు, ప్రసాద్, సుబ్బారెడ్డి, రాంప్రసాద్ పాల్గొన్నారు.

## కన్నుల పండువగా శ్రీవారి కల్యాణం



శ్రీవారి కల్యాణం దృశ్యం

కడప కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రవణ నక్షత్రం పురస్కరించుకుని తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవుని కడపలో వెలసిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. తిరుమలేసుడు శ్రీదేవి, భూదేవి సమేతుడై కొలువుదీరి అత్యంత సుందరాకారుడుగా భక్తులకు దర్శనమిచ్చారు. కాగా కల్యాణం సందర్భంగా చెన్నై నివాసి జె. ప్రసన్న వెంకటేశ్వరరావు స్వామివారికి సుమారు 92,280 రూపాయల విలువైన ఒక కేజీ నలభై గ్రాముల వెండి వస్తువులు.(నాలుగు తీర్థపు గిన్నెలుగా మరో నాలుగు ఉద్దరిని) బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, అర్చకులు క్రష్ణమోహన్, త్రివిక్రమ్, సాయి, తరుణ్, భక్తులు స్వామివారి కల్యాణం తిలకించారు.

## ఎస్టీయూ నేత బాల మల్లారెడ్డి మృతి



కడప ఎడ్యుకేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సుపరిచితులు గాంధీనగర్ హైస్కూలు హిందీ ఉపాధ్యాయుడు, ఎస్టీయూ ఉద్యమ నేత బాలమల్లారెడ్డి శనివారం మృతి చెందారు. 30 ఏళ్ల హిందీ పండితుడు, కడప నగ రం ఎర్రముక్కపల్లె వాసిగా గత తరం విద్యార్థినీ విద్యార్థుల కు చక్కని విద్యాబోధన చేశారన్నారు. కఠినమైన హిందీభాషను సరళంగా నేర్పిన ఉత్తమ గురువు, తోటి ఉపాధ్యాయులకు హితైషిగా పేరు పొందారన్నారు. శనివారం ఆయన అ నారోగ్య కారణంగా వల్ల స్వర్గస్తులయ్యారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ అటు ఉపాధ్యాయునిగా ఎస్టీయూ సంఘం బాధ్యుడిగా ఆయన పనితీరు గుర్తు చేసుకుంటూ ఎస్టీయూ సంఘం, ఉపాధ్యాయ మిత్రుల తరఫున ఆయనకు అశ్రునివాళులర్పిస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని శిష్యబృందం కొరివి చంద్రశేఖర్, హరినాథ్‌రెడ్డి, తిరుపతి సీఐ శ్రీకాంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు తొండూరు మండలం అగడూరులో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు శిష్యబృందం తెలిపింది.

## చోరీకి వెళితే కాలు కోల్పోయింది...



చికిత్స పొందుతున్న ఇమామ్ హుస్సేన్

జమ్మలమడుగు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెన్నానది ఒడ్డున ఓ సత్రం వద్ద గరండాలను చోరీ చేసేందుకు శనివారం సాయంత్రం వెళ్లి గరండాలు మీదపడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... గడ్డవీధి వాసులు ఇమామ్ హుస్సేన్, తలారి బుజ్జి మద్యానికి బానిసలయ్యారు. ఈ క్రమంలో పెన్నానది ఒడ్డున సత్రం గరండాలు చోరీ చేసేందుకు మద్యం మత్తులోనే వెళ్లి అక్కడున్న పిల్లర్స్‌ను గడ్డపారతో తొలగించే ప్రయత్నం చేశారు. దీంతో గరండ మీదపడి ఇమామ్‌హుస్సేన్‌కు కుడికాలు తెగింది. ఘటన స్థలంలోనే పడిపోయాడు. ఎడమచెయ్యి విరిగింది. బుజ్జికి కుడి మోకాలుకు రక్తగాయం కాగా ఎడమకాలు విరిగింది. గాయపడిన వారిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఒకరిని కడప రిమ్స్‌కు మరొకరిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఘటన జరిగిన ప్రాంతాన్ని జమ్మలమడుగు అర్బన్ పోలీసులు సందర్శించి పరిశీలించారు.

## హత్య కేసులో ఇద్దరి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ

రైల్వేకోడూరు(రూరల్), నవంబరు 9:(ఆంధ్రజ్యోతి): తన తల్లిని దూషించాడన్న కోపంతో 6న వెంకటనారాయణను హత్య చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు రైల్వే కోడూరు సీఐ హేమసుందరరావు తెలిపారు. వివరాల్లోకెళితే... కోడూరు వాసి వెంకటనారాయణ ఫ్లోరింగ్ పనులు చేస్తుంటాడు. రెండేళ్లుగా అస్గర్ అలీ ఇంటిని బాడుగకు తీసుకుని అందులో సామగ్రి నిల్వ ఉంచేవాడు. ఇంటి అద్దె విషయంలో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఒకసారి వెంకటనారాయణ ఇంటి యజమాని తల్లిని దూషించాడు. కాగా ఫిబ్రవరిలో పనుల నిమిత్తం అనంత పురానికి వెళ్లిన అతను ఈ నెల 5న కోడూరుకు వస్తున్నట్లు తెలుసుకున్న అస్గర్ అలీ తన మిత్రుడు సునీల్ తేజతో కలసి అతన్ని చంపేందుకు పథకం రచించాడు. కోడూరుకు వచ్చిన వెంకటనారాయణకు ఫోన్ చేసి మద్యం తాగేందుకు ఆహ్వానిం చాడు. అతనితో కలసి రెడ్డివారిపల్లె పంచాయతీ చోడవరం చెరువు కట్టపైకి వెళ్లి మ ద్యం తాగుతుండగా మెడపై కత్తితో దాడి చేసి చంపినట్లు సీఐ వివరించారు. ఈ కేసులో నిందితులను శనివారం ఎక్సైజ్ కార్యాలయం వద్ద అదుపు లోకి తీసుకుని బైకు, కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కోడూరు అర్బన్ సీఐ హేమసుందర రావు, ఎస్ఐ నవీన్ కుమార్ సిబ్బంది రాజేంద్ర స్వామి, బాలాజీ, ఆకేఫ్, రాజును ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, డీఎస్పీ సుధాకర్ అభినందించారు.


# తరు విలాపం



**చెట్లు నరకడం వినాశనమే ● తరగిపోతున్న వృక్షసంపద**

**నాటుడు కంటే నరుకుడే ఎక్కువ ● అధికారులకు పట్టని వాల్టా**

బద్వేలుటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'ఎందరికో నీడ, ఫలాలు, కొయ్య, ఇంటికి అవసరమయ్యే పరికరాలను అందిస్తూ ఎంతో పచ్చగా ఉండే నన్ను నరకడం మానవ వినాశనానికి హేతువు. విశ్వానికి వెలుగు దివ్వెగా నిలిచి ప్రాణవాయువును అందిస్తూ మానవాళిని రక్షించే ఏకైక సాధనాన్ని. నా ఆగమనం. చల్లని మేఘాలకు తీపికబురు నా శ్వాస.... సుతిమెత్తని నాస్పర్శతోనే వరుణుడు పరవశమవుతాడు. నా తనువుచాటున భూమాత చల్లగా పవళిస్తుంది. సకల జనుల సుభిక్షానికి నా మనుగడే ప్రధానం. అలాంటి నాకే నిలువనీడలేకుండా చేశారు.



బద్వేలు హైవేపై చెట్లను నరికేస్తున్న దృశ్యం

మారణాయుధాలతో నన్ను ఖండఖండాలుగా నరికేస్తున్నారు. నేలేని ప్ర పంచమే శూన్యం.. అంటూ ఓ తరువు తరుముకొస్తున్న ప్రళయాన్ని చెబుతూ రక్తకన్నీటిని నేలరాలుస్తోంది.

ప్రకృతి ప్రకోపానికి మానవాళి అంతమయ్యే ఘడియలు దగ్గరలోనే ఉన్నాయనిపిస్తుంది. జిల్లా వ్యాప్తంగా చుక్కనీరులేక, నిలువనీడలేక నిప్పులకుంపటి నడుమ మండిపోతున్నా మనిషి మారడంలేదు. ధనాపేక్షే ధ్యేయంగా స్వార్థానికి పచ్చనిచెట్లను కొందరు నరికి సొమ్ము చేసుకుంటున్నారు. కరువు నిలయమైన ప్రాంతాల్లో అధికంగా మొక్కలు పెంచాల్సింది పోయి ఉన్నవాటినే నేలకూల్చుతున్నారు.

వాతావరణ సమతుల్యతను కాపాడే క్రమంలో ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు అనుగుణంగా ప్రజలు అధికారుల్లో చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం ఆశించిన ఆశయం సఫలమవుతుంది. కళ్లముందే భయాందోళనలు కన్పిస్తున్నా ఎవరికి వారు మిన్నకుంటున్నారు. నీరు, చెట్టు, నేల పరిరక్షణ కోసం 2002లో ప్రవేశపెట్టిన వాల్టాచట్టాన్ని కొందరు స్వార్థపరులు ఉల్లాపల్లా చేస్తున్నారు. ప్రకృతి ప్రసాదిత వనసంపద కనుమరుగైపోతోంది. స్వార్థంతో పచ్చనిచెట్లను నరికేస్తుండడంతో సకాలంలో వర్షాలు కురవక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఐదేళ్లగా సాధారణం కంటే తక్కువ శాతం వర్షాలు కురవడంతో రైతులు కరువుతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. సకాలంలో వర్షాలు కుర వకపోవడానికి కారణం అడవుల పట్ల నిర్లక్ష్యం వహించడం, కాపాడుకోలేక పోవడమేనని తెలిసినా ఇష్టానుసారంగా అటవీ ప్రాంతాల్లో, రహదారుల పక్కన, పట్టా భూముల్లో యథేచ్ఛగా పచ్చని చెట్లను నరికేస్తున్నారు. పట్టా ఉన్నా, అనుమతులు తీసుకోవాలన్న నిబంధనలు ఉన్నా, ఇవేమీ పట్టించుకోకుండా చెట్లను నరికి విక్రయిస్తున్నారు. అటవీశాఖ అధికారులు పట్టించుకోక పోవడంతోనే పచ్చనిచెట్ల నేలకొరుగుతున్నాయి. చాలా ప్రాంతాల్లో మొక్కలను నాటి తరువాత వదిలేయడంతో రక్షణ కరువై నిట్టని ఉవునా మొక్కలు ఎండిపోతున్నాయి. ఇన్ని లక్షల మొక్కలు నాటామని అధికారులు లెక్కలు చెప్పడమే తప్ప, నాటిన మొక్క లను ఎన్నింటిని సంరరక్షించారన్న మాటలకు అధికారుల్లో సమాధానం లేదు. ఇప్పటికైనా అధికారులు మొక్కలను సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటే మంచిది.

### నాటుడు కంటే నరుకుడే ఎక్కువ

ఏడాదికి ఏడాది అటవీ విస్తీర్ణం తగ్గిపోతోంది. జిల్లా వ్యాప్తంగా కొన్ని మండలాల నుంచి కలప అక్రమరవాణాకు అడ్డుకట్ట వేయడంలో ఫారెస్ట్ అధికారులు అడ్డుకట్ట వేయకపోవడంతో ఆయా ప్రాంతాల నుంచి వంట చెరుకు, ఇటుకల బట్టీలకు, బొగ్గుల తయారీకి, నివాసగృహా ల కలపకు ట్రాక్టర్ల, లారీల నుంచి వృక్షసంపద తరలిపో తోంది. ఇప్పటికైనా ఫారెస్ట్ అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లారీల్లో తరలివెళుతున్న వృక్షసంపద (ఫైల్‌ఫొటో)



## 9 మందికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా నుంచి 9 మందిని రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యా అవార్డులకు విద్యాశాఖ ఎంపిక చేసింది. విశేష ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను సోమవారం మంగళగిరిలో సత్కరించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబరు 5న జరగాల్సిన గురుపూజోత్సవాన్ని విజయవాడ వరదల కారణంగా ప్రభుత్వం వాయిదా వేసింది. అయితే ఈ వేడుకలు సోమవారం విజయవాడ ఎక్స్‌కన్వెన్షన్ సెంటరులో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యాశాఖమంత్రి నారాలోకేశ్ హాజరై ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను అందజేయనున్నారు

### ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు పాఠశాల విద్యకు సంబంధించి ప్రొద్దుటూరు మోడంపల్లె మున్సిపల్ హైస్కూలు బయాలజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు కొండారెడ్డి ఎంపికయ్యారు.

### కళాశాలల విభాగంలో

జూనియర్ కళాశాల విభాగంలో జమ్మలమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాల, బోటనీ అధ్యాపకుడు వెంకటక్రిష్ణయ్య ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికయ్యారు. టెక్నికల్ విభాగంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల సివిల్ ఇంజనీరు అధ్యాపకులు మహేశ్ ఎంపికయ్యారు. డిగ్రీకళాశాల విభాగంలో కడప ప్రభుత్వ పురుషుల కళాశాల అధ్యాపకులు డాక్టర్ సయ్యద్ వసూరుల్లాఫక్తీయారి, డాక్టర్ నీలయ్య, కడప ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ జి.విజయలక్ష్మీదేవి ఉత్తమ అధ్యాపకులుగాఎంపికయ్యారు. యూనివర్శిటీ విభాగం నుంచి వైవీయూ ప్రొఫెసర్ విజయభారతి, ప్రొఫెసరు ఎల్.వీ రాంజేయరెడ్డి, ప్రొఫెసర్ ఎం.అనిత ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికయ్యారు.

## 12 నుంచి గండి క్షేత్రంలో పవిత్రోత్సవాలు

చక్రాయపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గండిలో ఈనెల 12వ తేదీ మంగళవారం నుంచి 15వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తారని ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. 12న అంకురార్పణతో ప్రారంభమై అనుజ్ఞ, విష్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం తదితర పూజాకార్యక్రమాలు ఉంటాయన్నారు. 13, 14వ తేదీల్లో ఆరాధనలు జరుగుతాయన్నారు.

## 'వేధింపులతోనే ఆత్మహత్యకు యత్నించా'

కడప క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చిన్నచౌకు రైటర్ శివకుమార్ వేధింపులతోనే ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించానని కానిస్టేబుల్ అశోక్ తెలిపారు. కడప నగరంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ తనకు అనారోగ్యం ఉందని తెలిసి కూడా ఇతర ప్రాంతాలకు రైటర్ డ్యూటీ వేయించాడన్నారు. ఉద్దేశపూర్వకంగానే డ్యూటీలు వేశాడని ఆరోపించారు. శుక్రవారం ఆర్ట్స్ కళాశాల వద్ద విషరసాయనం తాగి బైకుపై డీటీసీ వద్దకు వెళ్లగా అప్పటికే అపస్మార స్థితిలో కింద పడిన తనను కుటుంబసభ్యులు ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపారు. ఈ విషయంపై చిన్నచౌకు రైటర్ శివకుమార్ వివరణ అడగ్గా అశోక్ ఎప్పుడూ డ్యూటీ చేయలేదని, విజయవాడ డ్యూటీకి వెళ్తావా అని అడిగాను తప్ప నేను డ్యూటీ వేయలేదని తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నాడని తెలిపారు.

## ఎర్రచందనం దుంగలు పట్టివేత

### ● కారు స్వాధీనం, ఒకరి అరెస్టు

రైల్వేకోడూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కారులో తరలిస్తున్న ఆరు ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కడప సబ్ కంట్రోల్ ఆర్ఐ చిరంజీవులు, ఆర్ఎస్ఐ పి.నరేష్, ఎఫ్‌బీఓ నాగేశ్వర్‌నాయక్, సిబ్బంది శనివారం తిరుపతి-కడప జాతీయ రహదారిలోని ఎం.బావి వద్ద వాహనాలను తనిఖీలో ఇద్దరు కారు దిగి పారిపోయేందుకు ప్రయత్నించారు. టాస్క్‌ఫోర్సు బృందం వారిని వెంటాడి ఒకరిని అదుపులోకి తీసుకుంది. విచారణలో నిందితుడు ఒంటిమిట్టకు చెందిన వాడిగా తేలింది. 6 ఎర్రచందనం దుంగలు, కారును స్వాధీనం చేసుకుని తిరుపతి టాస్క్‌ఫోర్సు కార్యాలయానికి తరలించారు. అతడిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్ రఫీ తెలిపారు.

## బాలికకు పెళ్లి యత్నం - అడ్డుకున్న పోలీసులు

ముద్దనూరు నవంబరు9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓ గ్రామంలో బాలికకు నిశ్చయతాంబూలాన్ని పోలీసులు అడ్డుకున్నారు. సీఐ సమాచారం మేరకు వివరాలు.. గ్రామంలోని ఎస్సీ కాలనీలో 16 ఏళ్ల బాలికకు కొండాపురం వాసితో నిశ్చయతాంబూలం నిర్వహిస్తున్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదుపై పోలీసులను పంపి ఆపివేశారు. బాలిక తండ్రిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సీఐ తెలిపారు.

## 48 చీనీచెట్లు నరికి వేత

ముద్దనూరు నవంబరు9(ఆంధ్రజ్యోతి): మంగపట్నంలో శుక్రవారం రాత్రి బోడెద్దుల బయపురెడ్డికి చెందిన చీనీ చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. ఐదెకరాల్లో చీనీ చెట్లు ఉండగా 48 చీనీచెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికేసినట్లు, బాధితుని ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## రాష్ట్ర అవార్డుకు కొండారెడ్డి



ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): డీబీసీఎస్ మున్సిపల్ హైస్కూలు జీవశాస్త్ర ఉపాధ్యాయుడు శ్రీయపురెడ్డి కొండారెడ్డిని ప్రభుత్వం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసింది. 1995లో మోడంపల్లె మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా విధుల్లో చేరారు. 2003లో డీబీసీఎస్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ కావడంతో ఆ పాఠశాలకు వెళ్లారు. 2007లో జీవశాస్త్ర ఉపాధ్యాయుడుగా పదోన్నతి పొంది అనిబీసెంట్ మున్సిపల్ హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. ఆయన ఆధ్వర్యంలో ఆ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్ పోటీల్లో పాల్గొన్నారు. 2011లో రాజస్థాన్‌లో జరిగిన జాతీయస్థాయి సైన్స్‌ఫేర్‌లో, 2013లో భోపాల్‌లో జాతీయస్థాయి సైన్స్‌ఫేర్‌లో డీబీసీఎస్ విద్యార్థులు పాల్గొన్నారు. ఆయన ఆధ్వర్యంలో 18సార్లు రాష్ట్రస్థాయి, మూడుసార్లు జాతీయస్థాయి సైన్స్‌ఫేర్ పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. ఏపీ సైన్స్ కాంగ్రెస్ సమావేశాల్లో మూడుసార్లు పాల్గొన్నారు. ఉపాధ్యాయ వృత్తికన్నా ముందు ఆయన చెక్కభజన కళాకారుడు. 1988లో మహానాడులో చెక్కభజన చేసి అప్పటి సీఎం ఎన్టీరామారావు నుంచి బహుమతి అందుకున్నారు. కడప దశాబ్ది ఉత్సవాల్లో విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. ఆయన ప్రతిభను గుర్తించి 2016లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందజేశారు. ఈ ఏడాది డిసెంబరు 31న రిటైర్ కానున్నారు. అవార్డుకు ఎంపిక కావడంపట్ల కుటుంబసభ్యులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 50 కిలోల గంజాయి స్వాధీనం

చిట్వేలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనుంపల్లె చెక్‌పోస్టు వద్ద 50 కిలోల గంజాయిని, కారును స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు తెలియజేశారు. శనివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. గంజాయి రవాణాపై సమాచారం అందడంతో తహసీల్దారు మోహనకృష్ణ, ఓబులవారిపల్లె ఎస్ఐ మహేశ్, చిట్వేలి ఎస్ఐ రఘురాం, సిబ్బందితో కలిసి చెక్‌పోస్టు వద్ద నిఘా ఉంచారు. రాపూరు నుంచి చిట్వేలి వైపు వస్తున్న కారు ఆపకుండా వెళ్లిపోవడంతో వెంబడించి పట్టుకున్నామన్నారు. కారులో 50 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. శ్రీకాళహస్తికి చెందిన సాయి చైతన్య కారుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడిని శనివారం రాజంపేట కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

## నలుగురు దొంగలు అరెస్ట్

చిట్వేలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురిని శనివారం అదుపులోకి తీసుకున్నట్టు రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు తెలియజేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ చర్చి సమీపంలో దుండగులు గత నెల 21న తనను బెదిరించి మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారని ఈ నెల 5న ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన ఎస్ఐ రఘురాం శనివారం బైక్‌పై వెళుతున్న నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా అనంతపురం జిల్లా గుంతకల్లు వాసులు ఏఎం మోసిన్, షేక్ హైదర్ అలీ, సయ్యద్ రసిక్యూ హుస్సేన్ అజీజ్, జాఫ్రి అలీ రాజా అజీజ్‌గా తేలిందన్నారు. వీరి నుంచి 16 గ్రాముల బంగారు చైను, మోటారుబైకును స్వాధీనం చేసుకుని రాజంపేట కోర్టుకు హాజరుపరిచామని సీఐ వెంకటేశ్వర్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రఘురాం, సిబ్బంది పాల్గొన్నారు.

# పాతాళంలోకి.. గంగమ్మ!

● వర్షాకాలంలోనే ఎండిపోతున్న నీటి పథకాలు ● వేసవిలో ఎలాగో..

**మండలంలో రెండేళ్లుగా నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులు తాగునీటి పథకాలపై ప్రభావం చూపుతున్నాయి. భూగర్భ జలం అడుగంటిపోతుండడంతో గ్రామీణులకు తాగునీరందించే బోర్లు ఒక్కొక్కటిగా ఎండిపోతున్నాయి. సాధారణంగా వేసవిలో మాత్రమే ఎదురయ్యే తాగునీటి కష్టాలు ఆరు నెలల ముందుగానే ప్రారంభమయ్యా యని ప్రజలు అంటున్నారు. వర్షాకాలంలోనే పరిస్థితి ఇలా ఉంటే.. వేసవిలో ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.**





వ్యవసాయ బోరు వద్ద నీటికోసం వేచిఉన్న బోయపల్లి మహిళలు (ఇన్‌సర్ట్) బండకాడ హరిజనవాడపల్లెలో ఎండిపోయిన తాగునీటి పథకం

సంబేపల్లె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో 38 ఉపరితల నీటి ట్యాంకులు, 35 సింథటిక్ ట్యాంకులు,. 150 డైరెక్ట్ పంపింగ్ నీటి పథకాలు ఉన్నాయి. పలు గ్రామాల్లో చేతిబోర్లు ఉన్నా అవి పని చేయడం లేదు. దీంతో గుక్కెడు తాగునీటి కోసం కష్టాలు పడుతున్న పల్లెలు ఎన్నో ఉన్నాయి. సంబేపల్లె, మాధంవాండ్లపల్లె, నారాయణరెడ్డి, బొగ్గులవారిపల్లె, దొడి సిద్దయ్యగారిపల్లె, నామాలగుట్ట, శెట్టిపల్లి, తూర్పుపల్లి, దొడ్డి సిద్దయ్యగారిపల్లె, శెట్టిపల్లె, బండకాడ హరిజనవాడ తదితర ప్రాంతాల ప్రజలు తాగునీటి కోసం వ్యవసాయ బోర్లను ఆశ్ర యిస్తున్నారు. కొందరు ద్విచక్ర వాహనాలపై వ్యవసాయ బోర్ల నుంచి నీరు తెచ్చుకుంటుండగా, ఆ అవకాశం లేని పేదలు కిలో మీటర్ల దూరం నడిచి వెళ్లి మరీ తాగునీటిని భుజాలపై మోసుకుని తెచ్చు కుంటున్నారు. దీంతో కూలి పనులకు వెళ్లే అవకాశం లేక అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు.

### బైక్‌పై నీరు తెచ్చుకుంటున్నాం..



వర్షాకాలంలోనే ఇలా ఉంటే వేసవిలో ఎలా ఉంటుందో.. వ్యవసాయ బోర్ల నుంచి బైక్ పై తాగునీరు తెచ్చుకుంటు న్నాం. దీంతో పనులు మానుకో వాల్సి వస్తోంది అధికారులు సమస్య గుర్తించి ట్యాంకర్‌తో నీరు సరఫరా చేయాలి.

- యాదగిరి, నామాలగుట్ట

### బోర్లలో నీళ్లురావడం లేదు



బోర్లలో నీళ్ల రోజు రోజుకు తగ్గిపోతున్నాయి. వర్షాలు కుర వకపోవడంతో రెండేళ్లుగా చెరు వులు, కుంటలు, బావులు నిం డలేదు. ఎక్కడ చూసినా ఎం డిపోయి బీళ్లను తలపిస్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే కష్టమే..


- చంద్రబాబు, సంబేపల్లె

### ట్యాంకర్లకు ప్రతిపాదనలు పంపాం

మండలంలో వర్షాభావం కారణంగా భూగర్భ జలాలు అడుగంటడంతో తాగునీటి పథకాలు ఎండిపోయి గ్రామాల్లో సమస్య ప్రారంభమైంది. మండలంలోని 17 పల్లెల్లో ట్యాంకర్ల ద్వారా తాగు నీటి సరఫరాకు ప్రతిపాదనలు పంపాం. అను మతులు రాగానే తాగునీటి సమస్య పరిష్కా రానికి చర్యలు తీసుకుంటాం.

- మహేశ్వరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

## పశువుల్లో వ్యాధుల నివారణకు చర్యలు



కందగడ్డల ప్రతాప్, ఏడీఏహెచ్, రాజంపేట

ముఖాముఖి

రాజంపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో వచ్చే వ్యాధులు, వాటి నివారణకు తీసుకుంటున్న చర్యలు, పశుగణనతో ఉపయోగాలపై సంధించిన ప్రశ్నలకు పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు కందగడ్డల ప్రతాప్ సమాధానాలిచ్చారు

**?: వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలు**

!: వర్షాకాలంలో పశువులు పారుడు, గొంతువాపు వ్యాధికి గురవుతుంటాయి. ఇంటింటికి వెళ్లి వ్యాధి నిర్ధారించి మందులు వేస్తున్నాం. తీవ్ర జ్వరం , నోటిలో పుండ్లు, కళ్లు ఎర్రబడడం, ముక్కునుంచి చీముడు, దుర్వాసన పారుడు వ్యాధి లక్షణాలు.

**?: పశువుల్లో వ్యాధి నివారణకు తీసుకుంటున్న చర్యలు**

!: పుల్లంపేట, నందలూరు, రాజంపేట ప్రాంతాల్లోని పశు వైద్యశాలలను పర్యవేక్షిస్తున్నాం. రాజంపేట ఏరియా వెటర్నరీ ఆసుపత్రిలో ఎమర్జెన్సీ కేసులకు చికిత్స చేస్తున్నాం.

**?: పశుసంపద ఎంత ఉంది**

!: రాజంపేట పట్టణంలో 1500, నందలూరులో 12 వేలు, రాజంపేట రూరల్‌లో 11 వేలు, పుల్లంపేటలో 4500 పశువులు ఉన్నాయి. నందలూరు మండలం కొమ్మూరు, కోనాపురం సోమశిల బ్యాక్‌వాటర్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా పశుసంపద ఉంది.

**?: పశుగణనతో ఉపయోగాలు**

!: గ్రామం ప్రామాణికంగా పశుగణన చేయడం ద్వారా దేశంలో పశుసంపద ఎంత ఉందో తెలుస్తుంది. పశు సంతతి పెరిగితే స్థూల జాతీయ సంపద పెరుగుతుంది. మాంసం, పాల దిగుబడులు పెరుగుతాయి.

# ప్రతి అర్జీని క్షేత్ర స్థాయిలో పరిశీలించాలి

● జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



అర్జీదారునితో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్

గాలివీడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని పరిశీలించి, నిర్దేశిత సమయంలోపు సమస్యలకు పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదేశించారు. శనివారం స్థానిక తహ సీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు, రెవెన్యూ సిబ్బందితో పీజీఆర్‌ఎస్‌లో అందిన అర్జీల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల్లో ఇంకా కొన్ని పరిష్కారం కాలేదని, నిర్దేశిత కాలంలోపు వాటిని పరిష్కరించాలన్నారు. సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారికి విన్నవించాలన్నారు. పీజీఆర్‌ఎస్ ద్వారా అందిన ప్రతి అర్జీని ఆడిట్ చేస్తామన్నారు. అర్జీదారుల్లో కొంత మందికి నేరుగా ఫోన్ చేసి సమస్యల పరిష్కారంపై ప్రజా స్పందన తెలుసుకుంటామన్నారు. గ్రామ సచివాలయాల్లో సిబ్బంది హాజరును ఎంపీడీవోలు పర్యవేక్షించాలన్నారు. సచివాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సమస్యలతో వచ్చే ప్రతి అర్జీదారుని సమస్యను సావధానంగా విని పరిష్కరించడానికి వీలుపడే వాటికి సత్వర పరిష్కారం చూపాలని, పరిష్కరించలేని సమస్యల వివరాలను అర్జీదారునికి పూర్తిగా తెలియజేయాలన్నారు. అర్జీల రీఓపెన్‌కు తావు లేకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. రీసర్వే, ఫ్రీహోల్డ్ వెరిఫికేషన్, మ్యుటేషన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.

**క్షేత్రస్థాయిలో పరిశీలన**

మండలంలోని గోరాన్‌చెరువు గ్రామం కుమ్మరపల్లికి చెందిన అనిమెల భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం జేసీ తహసీల్దార్ భాగ్యలత, రెవెన్యూ శాఖ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే నెంబర్ 1963లో 15 ఎకరాలు 12 సెంట్ల డీకేటీ భూమిలో ఎంతమందికి పట్టాలు ఉన్నాయి. నిర్ధారించి సర్వే చేసి మిగిలిన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని తహసీల్దార్‌కు సూచించారు. . ఈ కార్యక్రమంలో ఆర్ఐ బాలాజీ, వీఆర్‌వోలు, సర్వేయర్లు, వివిధ సంబంధిత శాఖల, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాయిలోకేశ్

రాయచోటిటౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయి లోకేశ్ పిలుపునిచ్చారు. శనివారం రాయచోటి పట్టణంలోని సాయి శుభ కల్యాణ మండపంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, రాష్ట్రంలో కేంద్ర సహకారంతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బీజేపీ రాష్ట కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీకి వెళ్లనని చెప్పడం సిగ్గుచేటన్నారు.. గతంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరితో పాటు ఇతర బీజేపీ నేతలపై వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధులు ఎన్నో రకాల అసభ్యకర పోస్టులు పెట్టడం వారు మరిచి పోయారా అని ప్రశ్నించారు.

**రాజంపేట టౌన్:** పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని జిల్లాస్థాయి ఎన్నికల అధికారి బీజేపీ రాష్ట్ర నాయకులు నరసింగరావు తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ దూసుకు పోతోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి బ్రహ్మం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేశ్‌నాయుడు, ఎన్నికల సహాయ అధికారి పులి నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గోకులాష్టమి పూజలు



గోకులాష్టమి పూజలు చేస్తున్న భక్తులు

ఓబులవారిపల్లె, నవంబరు 09 (ఆంధ్రజ్యోతి) : గోకులాష్టమి సందర్భంగా స్థానిక గోమాత సేవాట్రస్టు గోశాలలో వీహెచ్‌పీ రైల్వేకోడూరు ప్రఖండ ఆధ్వర్యంలో గోపూజ, దుర్గావాహిని సభ్యులతో విష్ణు సహస్రనామ పారాయణం, కోడూరు భజన బృందం ఆధ్వర్యంలో భజనలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. వెంకటరెడ్డి, శ్రీధర్, నరసింహులు, ధశరథరామయ్య, సుబ్రమణ్యంరాజు, శ్రీనివాసులు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.



## కార్యకర్తలే టీడీపీ కుటుంబ సభ్యులు



రాయచోటి: సభ్యత్వ నమోదు చేస్తున్న ఐటీడీపీ నేతలు

రాయచోటిటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలను కుటుంబ సభ్యులుగా భావించే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని ఐటీడీపీ రాజంపేట కార్య నిర్వాహక కార్యదర్శి కసినేని మహేందర్‌నాయుడు అన్నారు. శనివారం మాసాపేటలో ఇంటింటికి వెళ్లి టీడీపీ సభ్యత్వంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి నియోజకవర్గ ఐటీడీపీ ఛాంపియన్స్ నాగభూషణ్ రెడ్డి, మండల నాయకులు సుగవాసి విద్యాధర్, వెంకటేశ్, సాగర్, గిరి మండల పరిధిలోని కార్యకర్తలు, పలువురు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

**గాలివీడు:** టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు చేయూత నివ్వడానికే సభ్యత్వ నమోదు అని సర్పంచ్ పార్థసారధి రెడ్డి తెలిపారు.పూలుకుంట బోరెడ్డిగారిపల్లె పంచాయతీలో సభ్యత్వ నమోదు సందర్భంగా ఆయన మాటాడారు. మహిళా నాయకురాలు సులోచనమ్మ, బూత్ స్థాయి ఏజెంట్ నాగేశ్వరరావు, యువగళం సభ్యులు సాయిప్రసాద్ రెడ్డి, బూత్ కన్వీనర్లు శివశంకర్, సుదర్శన్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు గోపాలయ్య, ఎఫ్‌పీ షాప్ డీలర్ టోపీవలీ సాబ్, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ కొండారెడ్డి, టీడీపీ నాయకులు రామాంజులురెడ్డి, వెంకటేశ్, రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

**సిద్దవటం :** మండల పరిధిలోని మాధవరం-1 గ్రామంలో మండల టీడీపీ అధ్యక్షులు శనివారపు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీడీపీ నేతలపై సోషల్‌మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టిన వారందరికి తగిన గుణపాఠం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జి దశరథనాయుడు, నేతలు డాక్టర్ వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.



# అధికారులు తీరు మార్చుకోవాలి : చమర్తి



మాట్లాడుతున్న చమర్తి జగన్ మోహన్ రాజు

సుండుపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారినా ఇంకా వైసీపీ పాలనలో ఉన్నామనే భ్రమలో ఉన్న అధికారులు తమ తీరు మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని రాజంపేట పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుండుపల్లి మండల అధ్యక్షుడు కల్లే రెడ్డప్ప, అర్గనైజింగ్ సెక్రటరీ మాలేపాటి శివరాం నాయుడు మాట్లాడుతూ మండలంలో పల్లె పండుగ నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. అభివృద్ధి పనులను కొంత మంది ప్రజా ప్రతినిధులు అడ్డుకుంటున్నారన్నారు. అనంతరం చమర్తి జగన్ మోహన్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వం కార్యకర్తలకు అండగా ఉందని, పార్టీ కోసం కష్టపడిన వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ప్రసాద్ రాజు, ఎంపీటీసీ మాజీ సభ్యులు బెల్లాల రమణయ్య, మోహన్ బాబు నాయుడు, మాలేపాటి సురేష్ నాయుడు, జనార్దన్, ఎల్వీ రమణ, కిరణ్, సుబ్బరాం, మస్తాన్, చంద్రమౌళి, చంద్ర మోహన్, మంగిరి సురేష్, రాయవారం సర్పంచ్ మహ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

**నందలూరు:** స్థానిక ప్రవీణ్ బ్రిక్స్‌లో మండల టీడీపీ అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో వేగం పెంచాలన్నారు.



## 'విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరం'



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వృత్తి విద్యాశాఖఅధికారి బండి వెంకటసుబ్బయ్య

రైల్వేకోడూరు, నవంబరు 9:(ఆంధ్రజ్యోతి) విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరం అని జిల్లా వృత్తి విద్యా శాఖాధికారి బండి వెంకటసుబ్బయ్య తెలి పారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రాష్ట్ర స్థాయి అండర్ -19 హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి చమర్తి శారద మాట్లాడుతూ ఈ పోటీల్లో ఎంపిక అయిన వారు డిసెంబరులో పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. 11వ తేదీ వరకు పోటీలు నిర్వ హిస్తామన్నారు. శనివారం విజయనగరం, శ్రీకాకుళం, చిత్తూరు, తూర్పుగోదావరి, కడప, క్రిష్ణ తదితర జిల్లాలకు చెందిన బాలికల జట్లు పోటీపడ్డాయి. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు ఎస్. విజయ ప్రసాద్‌రెడ్డి, ఓబులరెడ్డి, నాగేశ్వరరెడ్డి, అరుణకుమారి, చంద్రమోహన్ రెడ్డి, నీలకంఠరావు, రామాంజ నేయులు, సోమశేఖర్ నాయక్, పర్యవేక్షకులు విజయకుమార్‌రెడ్డి, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రసాద్‌వర్మ, చిన్నఓరంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి. హరిత, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## సీపీ బ్రౌన్‌కు ఘననివాళి



సీపీ బ్రౌన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న తెలుగు భాషా సమితి నేతలు

రాజంపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): యోగివేమనను ప్రపంచానికి పరిచయం చేసిన ఘనుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ అని తెలుగుభాషా సంరక్షణ సమితి నాయకులు కొనియాడారు. శనివారం పట్టణంలోని సరస్వతి విద్యామందిరంలో సీపీ బ్రౌన్ 226వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా సమితి జిల్లా సహాయ కార్యదర్శి గంగనపల్లి వెంకటరమణ, అధ్యక్షుడు రామచంద్రయ్య మాట్లాడుతూ తెలుగు భాషపై మక్కువతో సీపీబ్రౌన్ ఎన్నో తాళపత్ర గ్రంథాలను, రచనలను భద్రపరచారన్నారు. ప్రతిఒక్కరు భాషాభిమానాన్ని చూపి తెలుగును కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషా సంరక్షణ సమితి ఉపాధ్యక్షుడు బీవీ నారాయణరాజు, తెలుగు ఉపాధ్యాయుడు సుబ్రమణ్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోడూరు గౌరీ, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, దయాకర్, పావని, పుష్పలత, శ్రావణి, మౌనిక, మస్తాని, సబీహా, తదితరులు పాల్గొన్నారు.

**నందలూరు :** యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కడపలోని సీపీ బ్రౌన్ పరిశోధన కేంద్రం గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించనున్న చార్లెస్ ఫిలిప్స్ బ్రౌన్ జయంతి కార్యక్రమంలో ప్రధాన వక్తగా తనను ఆహ్వానించారని రాజంపేట స్పెషల్ జుడిషియల్ మేజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్ తెలిపారు.

## 'డ్వాక్రా' వివరాలు యాప్‌లో నమోదు చేయాలి

రామాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వయం సహాయక సభ్యుల వివరాలు సెర్ప్ యాప్‌లో నమోదు చేయాలని రామాపురం స్వయం సహాయక సంఘం ఏపీఎం దేవసేన అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సీసీలు, యానిమేటర్ల సమావేశంలో మాట్లాడుతూ వీఏవోలు స్వయంసహాయక సంఘాల సభ్యుల కుటుంబ వివరాలు తలసరి ఆదాయం, పిల్లలు, గ్యాస్ కనెక్షన్, ఆదాయ వివరాలు యాప్‌లో నమోదు చేయాలన్నారు. నిర్వీర్యంగా మారిన స్వయం సహాయక సంఘాలను పునరుద్ధరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రుణాల చెల్లింపు తీరును పరిశీలించి క్రమం తప్పకుండా చెల్లించేలా కృషి చేయాలన్నారు. ఈ సీసీలు ఆదినారాయణ, నాగరాజు, నరసింహులు, గంగాధర్, రెడ్డిబాబులు పాల్గొన్నారు.

## రోళ్లబోడు బేస్‌క్యాంప్‌లో సబ్ డీఎఫ్‌వో తనిఖీ



మ్యాప్ పరిశీలిస్తున్న బద్వేలు సబ్ డీఎఫ్‌వో స్వామివివేకానంద

సిద్దవటం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రోళ్లబోడు అటవీ ప్రాంతంలోని గొల్లపల్లె, సిదవటం బీట్‌లలో సిద్దవటం ఫారెస్ట్ రేంజి సిబ్బంది శనివారం కూంబింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బద్వేల్ అటవీ శాఖ సబ్‌డీఎఫ్‌వో బి.స్వామి వివేకానంద్ బేస్‌క్యాంపును తనిఖీ చేశారు. ఎర్రచందనం వృక్షాల పరిరక్షణపై సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం రేంజి అధికారి కళావతి, డిప్యూటీ రేంజర్ ఓబులేశు, ఎఫ్‌బీవోలు పెంచల్‌రెడ్డి, విశ్వనాథ్, మధు, ఫారెస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 'సమస్యల సాధనకు పోరాడుదాం'

పెనగలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సమస్యల సాధన కోసం సంఘటితంగా పోరాడుదామని నియోజకవర్గ విభిన్న ప్రతిభావంతుల గౌరవాధ్యక్షుడు మల్లు సుబ్బనరసారెడ్డి పిలుపునిచ్చారు. విభిన్న ప్రతిభా వంతుల దినం సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ప్రాంగణంలో యూనియన్ మండల అధ్యక్షుడు కడప తిరుపాలు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో రాజంపేటలో జరిగే సమావేశంలో మండలంలోని పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాజంపేట మండల సభ్యులు వెంకటప్రసాద్, పెనగలూరు మండల గౌరవాధ్యక్షుడు తిరుమలరెడ్డి, సభ్యులు ఆదినారాయణ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

చిన్నమండెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని మండల సర్వసభ్య సమావేశం తీర్మానించింది. శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ సభా భవనంలో ఎంపీపీ సుధామాధురి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి కష్టాలు లేకుండా చూడాలని నిర్ణయించారు. వ్యవసాయం, రెవెన్యూ, గృహ నిర్మాణం, ఆరోగ్యం, గ్రామీణ మంచినీటి, పశుసంవర్ధకశాఖ, విద్యుత్ అంశాలపై చర్చించారు. సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అన్నిశాఖ అధికారులు హాజరయ్యారు.

## గంగమ్మ దేవాలయ ప్రారంభోత్సవం

పెనగలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓబిలి గ్రామంలో ఇదే గ్రామానికి చెందిన కావేటి చలపతి, భాగ్యమ్మ దంపతులు రూ.16 లక్షలతో నిర్మించిన గంగమ్మ దేవాలయం ప్రారంభోత్సవాలు శనివారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఆదివారం గ్రామోత్సవం, సోమవారం విగ్రహ ప్రతిష్ఠ, మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## 35 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు

నందలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి మాతా సురక్షిత అభియాన్‌లో భాగంగా శనివారం మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో 35 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు, ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ శరత్‌కమల్, డాక్టర్ విశ్వనాథ్ తెలిపారు. 29 మంది గర్భిణులకు గైనకాలజిస్టు డాక్టర్ మస్తానమ్మ స్కానింగ్ నిర్వహించి, జాగ్రత్తలను తెలియజేశారు. ఈ సందర్భంగా రాయల్‌సేవా సమితి అధ్యక్షుడు గంగనపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 300 ఓపీ పుస్తకాలు అందజేశారు. అనంతరం గర్భిణులకు, ఆశ కార్యకర్తలకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటనారాయణ, సూపర్‌వైజర్ సునీల్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ నిజాయితీ..



బాధితురాలికి హ్యాండ్‌బ్యాగు అందజేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ రాజగోపాల్

నందలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆటో దిగుతూ ఓ మహిళ పోగొట్టు కున్న బ్యాగును ఆటోడ్రైవర్ ఆమెకు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు. శనివారం కడపకు చెందిన కల్లమడి మహాలక్ష్మీ అనే మహిళ నాగిరెడ్డిపల్లె పంచాయతీ అరవపల్లెలోని పోస్టాఫీసు వద్ద ఆటో దిగింది. లగేజీ తీసుకునే క్రమంలో ఆమె బ్యాగు అక్కడే పడిపోయింది. అది గమనించకుండానే ఆమె గ్రామంలోని అత్తగారింటికి వెళ్లిపోయింది. అక్కడికి వెళ్లి చూసుకోగా హ్యాండ్‌బ్యాగ్ కనిపించలేదు. ఈ విషయంపై వెంటనే ఆమె స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు పోస్టాఫీసు పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తుండగానే, ఆటో డ్రైవర్ మున్వర్‌బాషా పోలీసు స్టేషనుకు వచ్చి బ్యాగును అప్పగించాడు. ఆ బ్యాగులో 5 వేలు నగదు, సెల్‌ఫోను, బంగారు వస్తువులు ఉన్నాయి. ఎస్ఐ వెంకటేశ్వర్లు, హెడ్‌కానిస్టేబుల్ రాజగోపాల్ సమక్షంలో ఆయన బాధితురాలికి బ్యాగును అందజేశారు. దీంతో ఎస్ఐ ఆటో డ్రైవర్‌ను అభినందించారు.




# అపురూప చరిత్ర.. గండికోట

● సహజసిద్ధంగా ఏర్పడ్డ పెన్నాలోయ ● ఆకట్టుకుంటున్న మాధవరాయ స్వామి ఆలయ గోపురం ● ఇప్పటికీ చెక్కుచెదరని శిల్పసంపద ● పర్యాటకులను ఆకర్షిస్తున్న మహాదుర్గం


గండికోట ముఖద్వారం


గండికోటలోని రంగనాథస్వామి ఆలయం




(5వపేజీ తరువాయి)

దర్శనమిస్తుంది. 16వ శతాబ్దంలో అప్పటి నవాబులు దీనిని నిర్మించారు. శత్రువుల రాకపోకలను దాని పైకి ఎక్కి దూరం నుంచి చూసే సౌకర్యం కోసం ఏర్పాటు చేశారు. 400 సంవత్సరాలు అయినా నేటికీ చెక్కుచెదరలేదు. అప్పట్లో తప్పు చేసిన ఖైదీలకు వివిధ రకాల శిక్షలు ఉండేవి. శిక్ష పడిన వారిని నిర్బంధించేందుకు విడిగా కారాగారం ఉంది.

## ఆకట్టుకుంటున్న మాధవరాయస్వామి ఆలయం

కోట లోపల గల మాధవరాయస్వామి ఆలయ రాజగోపురం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఇప్పటికే అక్కడ చాలా సినిమాలు, షూటింగ్‌లు కూడా జరిగాయి. అప్పట్లో శత్రువుల దాడిలో కొద్ది భాగం ధ్వంసమైంది. గోపురం కింద గల ద్వారం పైన ఇటు లోపలికి వెళ్లేవారికి, అటు లోపల నుంచి బయటికి వచ్చేవారికి స్వాగతం చెబుతున్నట్లుగా నృత్య భంగిమల చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. వెయ్యేళ్ల కిందటి నాటి సంస్కృతి సంప్రదాయాలను ఆ శిల్పాల్లో నేటికీ చూడవచ్చు. గోపురం లోపల రెండు వైపులా అద్భుతమైన శిల్ప సంపద కనిపిస్తుంది. ఇనుప స్వభావం గల పెద్ద పెద్ద రాతిబండల స్తంభాలతో ఉన్న ఆ ఆలయం ఎంతటి ఎండలో అయినా చల్లగా ఉండటం విశేషం. దానిని దాటి లోపలికి వెళ్లా మంటే విశాలమైన హాలులో మండపం ఉంది. అందులో కళాప్రదర్శనలు జరిగేవి. అంతేకాకుండా ఏదేని వివాదాలు, వాటి విచారణలు కూడా అక్కడే జరిగేవి. గండికోట లోపల మరో విశేషం రంగనాధస్వామి ఆలయం. ఆలయం అన్ని వైపులా అపురూపమైన శిల్పసంపద దర్శనమిస్తుంది. ఆలయం లోపల వైష్ణవ సంప్రదాయం ప్రకారంగా ముఖమండపం, రంగమండపం, అంతరాలయం, గర్భాలయం, యాగశాల దర్శనమిస్తాయి. ప్రధానంగా రంగమండపంలో కూడా ప్రతి స్తంభంలో అద్భుతమైన శిల్పాలు చెక్కారు.

## ఆశ్చర్యంగొల్పే శిల్పుల నైపుణ్యం

కోటలోపల గల మాధవరాయస్వామి ఆలయంలో ఒక శిల్పం నేటికీ పర్యాటకులకు ఆశ్చర్యం కలిగిస్తుంటుంది. ఆ శిల్పం ఓ వైపు నుంచి చూస్తే వృషభంలా, మరో వైపు నుంచి ఏనుగులా కనిపిస్తుంది. వాటి రెండింటికీ గల శరీరాలు వేరుగా ఉంటూనే తల మాత్రం ఒకటిగానే ఉంటుంది. ఏనుగు తలను మూసి చూస్తే ఎద్దులా కనిపిస్తుంది, ఎద్దు తలను మూసి చూస్తే ఏనుగులా కనిపిస్తుంది. అప్పట్లోనే నాటి శిల్పుల చాతుర్యాన్ని దీనిని చూస్తే అర్థమవుతుంది.

## పటిష్టంగా నేటికీ వసారా

ఆలయం వెనుక గల మూడు వైపులా వసారా గదులు నేటికీ పటిష్టంగానే దర్శనమిస్తున్నాయి. ప్రాకారం లోపల (పాకశాల - వంటశాల అలంకార శాల) ఉన్నాయి. వెనుకభాగాన కల్యాణ మండపం, ఉత్తరం వైపున ఆళ్వార్ల మండపాలు ఉన్నాయి. చుట్టూ మూడువైపులా మొత్తంగా 56 స్తంభాల వసారా ఉంది. అన్ని స్తంభాలతో పాటు పైకప్పులో కూడా శిల్పాలు దర్శనమిస్తాయి.

## అందమైన ఆకృతిలో జుమ్మామసీదు

గండికోట లోపల ఉత్తరం వైపున అందమైన జుమ్మా మసీదు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. మసీదు లోపల 64, వెలుపల 32 గదుల వసారాలు ఉన్నాయి. వెలుపల గదిలో గుర్రాలను అప్పట్లో ఉంచేవారు. లోపల సైనికులు, సామంతరాజులు సభ చేసేవారు. రాజపీఠం స్థానంలో అందమైన మసీదు నిర్మించారు. ఎత్తయిన అరుగుపై ఉజూఖానా కూడా ఉంది. ఉత్తరం వైపు దిశగా వెళితే మసీదు పైకి మెట్లు ఉన్నాయి. ఎదురుగా నిలబడి మసీదును చూస్తే హైదరాబాదులో గల చార్మినార్ గుర్తుకు వస్తుంది.

**ఇలా చేరుకోవచ్చు..**

గండికోట జమ్మలమడుగు పట్టణానికి 14 కి.మీ దూరంలో ఉంది. కడప నుంచి కానీ, ప్రొద్దుటూరు నుంచి కానీ జమ్మలమడుగు వెళ్లి అక్కడి నుంచి గండికోట చేరుకోవచ్చు. గండికోట నుంచి ఆటోలు ఉంటాయి.

## కత్తుల కోనేరు

జుమ్మామసీదుకు ఎదురుగా కోనేరు ఉంది. దీనిని కత్తుల కోనేరు అంటారు. యుద్ధాలు చేసి వచ్చాక సైనికులు ఇక్కడ కత్తులను శుభ్రం చేసుకునే వారని అంటారు. ఇప్పటికీ కోనేరులో నీళ్లు ఉన్నాయి.

## పటిష్ట ధాన్యాగారం

జుమ్మా మసీదుకు పక్కనే ధాన్యాగారం ఉంది. దీనిని 12 స్తంభాలతో పటిష్టంగా నిర్మించారు. గండికోటను పాలించిన రాజుల్లో ఒకరైన మీర్‌జుమ్లా 16వ శతాబ్దంలో ఆ భవనాన్ని అత్యంత సుందర ధాన్యాగారంగా నిర్మించారు. ధాన్యం బస్తాలను సులభంగా తీసుకోవడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అప్పట్లోనే ఏర్పాటు చేసుకున్నారు. అందులో ఉంచిన ధాన్యం రెండేళ్ల పాటు పాడవకుండా ఉండేలా నిర్మించడం విశేషం. దాని పైకి వెళ్లడానికి ఉత్తరం వైపు నుంచి మెట్లు అమర్చారు. పై నుంచి చూస్తే జుమ్మామసీదు, కోటలోని మరికొన్ని ప్రాంతాలు కనిపిస్తాయి.

## కొండను రెండుగా చీలుస్తూ.. పెన్నానది

ఆలయం పక్కనే పెన్నాలోయ ఉంది. దీనినే గండికోట లోయ అని కూడా అంటారు. రెండు కొండలను చీలుస్తూ పెన్నా నది ప్రవహిస్తుంటుంది. వాస్తవానికి ఇక్కడ నదిలో నీళ్లు వేల సంవత్సరాలుగా ప్రవహించడం వలన కోతకు గురై అటు ఇటు కొండలుగా.. లోయలో నది ఉన్నట్టు ఉంటుంది. ప్రపంచంలో ఇలాంటి ప్రదేశం అమెరికాలోని గ్రాండ్ కెనాన్ మినహా మరెక్కడా లేదు. ఇలాంటి అద్భుతమైన లోయ ప్రపంచంలో ఇది రెండోది. అదుకే దీనిని గ్రాండ్ కెనాన్ ఆఫ్ ఇండియా అంటారు. ఈ ప్రాంతం పర్యాటకంగా ప్రాచుర్యంలోకి రావడానికి కూడా లోయే కారణం.


**రోప్‌వే ఏర్పాటు చేస్తే..**

గండికోట పెన్నానది లోయ అందాల సొగసులను మరింత ఆస్వాదించేందుకు అనువుగా రోప్‌వే సౌకర్యం కల్పిస్తే పర్యాటకుల సందడి మరింత పెరిగే అవకాశం ఉంది. తద్వారా ప్రభుత్వానికి మరింత ఆదాయం సమకూరే సౌలభ్యం ఉంటుంది. ఆ దిశగా పాలక ప్రభుత్వాలు స్పందించి రోప్‌వే సౌకర్యం ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇక్కడ బస చేయడానికి హరిత రెస్టారెంట్ ఉంది. ఇటీవల కొన్ని ప్రైవేటు గెస్ట్ హౌస్‌లు ఏర్పాటు చేశారు.

















విద్యార్థుల స్కూల్ రికార్డులు సరిదిద్దే

# అధికారం బదలాయింపు

**ఇక నుంచి డీవైఈవో, ఎంఈవో, హెచ్‌ఎంలకు అధికారం**

కలికిరి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల స్కూల్ రికార్డుల్లో తప్పులను లేదా సవరణలు చేసే అధికారాన్ని స్థానిక డిప్యూటీ విద్యా శాఖాధికారి (డీవైఈవో), ఎంఈవోలు, హెడ్మాస్టర్లకు బదలాయిస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరు విజయరామరాజు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇలాంటి సవరణల ఆమోదం తెలిపే అధికారం జిల్లా విద్యా శాఖాధికారులు, రీజినల్ జాయింట్ డైరెక్టర్లకు మాత్రమే ఉండేది. 'ఒకే దేశం.. ఒకే విద్యార్థి' అన్న నినాదంతో 'అపార్' ఐడీలు జారీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ఐడీల జారీ కోసం పాఠశాలల రికార్డుల్లో విద్యార్థులకు సంబంధించిన పలు అంశాలపై తప్పులు చోటు చేసుకున్నాయి. వీటిని సవరిస్తేగానీ ఆధార్ సవరణలకు వీలుకాదు. పూర్తి పక్కా సమాచారంతో ఆధార్ అప్‌డేట్ జరిగితే అపార్ ఐడీ జారీ సాధ్యమవుతుంది. ఈ నేపథ్యంలో స్కూల్ రికార్డుల్లో సవరణలను ఆమోదించుకోవడం కోసం డీఈవో, ఆర్జేడీ కార్యాలయాలకు వెళ్లడం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు భారంగా పరిణమించిందని డైరెక్టరు పేర్కొన్నారు. సవరణల ప్రక్రియను సులభతరం చేసేందుకు స్థానిక విద్యా శాఖ అధికారులకు సవరణలను ధృవీకరించే అధికారాన్ని బదిలీ చేసినట్లు తెలిపారు. 2025 మార్చి 31వ తేదీ వరకు మాత్రమే ఈ అధికారాన్ని పరిమితం చేస్తున్నట్లు డైరెక్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ విద్యార్థుల స్కూల్ రికార్డులను సరిచేయడానికి ఎంఈవోలకు అధికారం కల్పించారు. అదే ప్రభుత్వ, జడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థుల రికార్డుల సవరణకు ఆయా హెడ్‌మాస్టర్లకు అప్పగించారు. ఇక మిగిలిన ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు సంబంధించిన వ్యవహారాలకు డీవైఈవోలకు అధికారం కల్పించారు. అయితే రికార్డుల సవరణల్లో ఏవైనా అవకతవకలతో తారుమారు జరిగినట్లయితే కఠిన చర్యలకు గురవుతారని కూడా ఈ ఉత్తర్వుల్లో హెచ్చరించారు.

# అవినీతికి పాల్పడితే చర్యలు

● సచివాలయాలు, మీ-సేవ కేంద్రాల్లో తనిఖీ
● మున్సిపల్ కార్యాలయంలో కౌంటర్ ఏర్పాటు
● మున్సిపల్ కమిషనర్ ప్రమీల చర్యలు

మదనపల్లె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకొస్తున్న అపార్ ఐడీల కోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల సిబ్బందిని హెచ్చరించారు. 'బర్త్ సర్టిఫికెట్ల కోసం వసూళ్లు' అనే శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. దీనికి స్పందించిన మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఏఎస్‌వో వెంకటేష్‌నాయుడు తీవ్రంగా స్పందించారు. వసూళ్లపై అభియోగాలు, ఆరోపణలు వచ్చిన సచివాయాలు, మీ-సేవా కేంద్రాలను తనిఖీ చేశారు. బర్త్ సర్టిఫికెట్ల సవరణ కోసం వచ్చే ప్రజలతో కమిషనర్ మాట్లాడారు. మరోవైపు సచివాలయాలకు నియమించిన నోడల్ ఆఫీసర్లను సాధారణ పౌరులుగా పంపించి వాకబు చేయించారు. ఇక్కడ ఒక్కో సర్వీసుకు ఎంత తీసుకుంటారు? ఈ విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కమిషనర్‌తో పాటు నోడల్ ఆఫీసర్లు వేర్వేరుగా వారిని ఆరా తీశారు. ఒక్కో సర్వీసుకు నిర్ణీత రుసుం కంటే ఒక్క రూపాయి అదనంగా తీసుకున్నా తనకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. అలాగే మరోసారి ఇలాంటి ఫిర్యాదులు వస్తే అక్కడికక్కడే కఠినమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులను తీవ్రంగా హెచ్చరించారు. అలాగే మరికొందరు మీ-సేవా కేంద్రాల నిర్వాహకులను మున్సిపల్ కార్యాలయానికి పిలిపించి విచారించడంతో పాటు అభియోగం, ఫిర్యాదులు వచ్చిన వారిని తీవ్రంగా హెచ్చరించారు. అలాగే సచివాలయ అమ్యునిటీ, డిజిటల్ అసిస్టెంట్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి ముఖ్యంగా జనన ధ్రువీకరణ పత్రంలో సవరణలను వెంటనే, అక్కడికక్కడే నమోదు చేసి పరిష్కరించాలని సూచించారు. ఈ విషయంలో ప్రభుత్వం, కలెక్టర్ చాలా సీరియస్‌గా ఉన్నట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. మున్సిపాలిటీనే కాకుండా డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి చాలామంది వస్తున్నారని, వీరిని కొన్ని సచివాలయాలకే పరిమితం చేయకుండా, ఆయా పరిధిలోని అన్ని సచివాలయాలకు వెళ్లేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా శని, ఆదివారం కూడా పనిచేసేలా మున్సిపల్ కార్యాలయంలో కేంద్రాన్ని ప్రారంభించారు. అప్పటికీ సమస్యలు ఉంటే జనన ధ్రువీకరణ పత్రాల సవరణకు మున్సిపల్ కార్యాలయంలోనే ప్రత్యేకంగా నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేయాలని మేనేజర్ పి.ఆర్.మనోహర్‌కు సూచించారు. ఇందుకోసం శనివారం కార్యాలయానికి సెలవు అయినా ఆఫీసులో మేనేజర్‌తో సమావేశమై మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసి వివరాలు నమోదు చేయించారు.





మున్సిపల్ మేనేజర్ మనోహర్‌తో చర్చిస్తున్న కమిషనర్ ప్రమీల, మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రం

**నేటి నుంచి కడపలో**

# అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

● సిద్ధమైన డీఎస్‌ఏ స్టేడియం ● ర్యాలీకి 13 జిల్లాల నుంచి 4 వేల మంది అభ్యర్థుల రాక ● ప్రతిరోజు 800 మందికి స్ర్కీనింగ్ టెస్ట్

కడప స్పోర్ట్స్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశ సేవలో తరించేందుకు 'అగ్నివీరులు' కావాలని ఎదురుచూస్తున్న యువత లక్ష్యం చేరుకునే సమయం ఎట్టకేలకు ఆసన్నమైంది. ఆదివారం నుంచి 15వ తేదీ శుక్రవారం వరకు కడప నగరంలోని డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ (డీఎస్‌ఏ) మైదానంలో అత్యంత పకడ్బందీగా అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరగనుంది. అందుకు వీలుగా మైదానంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భరతమాత ముద్దుబిడ్డలు (సైనికులు)గా దేశం కోసం సేవలందించాలనే యువతకు ఈ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఒక గొప్ప అవకాశం అని చెప్పవచ్చు. ర్యాలీలో ఎంపిక కావాలనే ధ్యేయంతో ఇప్పటికే రన్నింగ్ ప్రాక్టీస్‌తో పాటు అందుకు అవసరమైన కసరత్తుతో ఇప్పటికే యువకులు సన్నద్ధమై ఉంటారు. ఏదిఏమైనా రిక్రూట్‌మెంట్ ర్యాలీలో తమను తాము నిరూపించుకోడానికి పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించక తప్పదు.

## రోజు 800 మందికి స్ర్కీనింగ్ టెస్ట్

కడపలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి 13 జిల్లాల నుంచి సుమారు 4 వేల మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. ఆ మేరకు కడప జిల్లాతో పాటు అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి హాజరు కానున్నారు. వీరిలో రోజుకు 800 మంది అభ్యర్థులకు స్ర్కీనింగ్ టెస్ట్ నిర్వహించేందుకు అనువుగా సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ముందస్తుగా అభ్యర్థులకు కాల్ లెటర్స్ పంపించారు. వాటిలో పొందుపరచిన తేదీ... సూచించిన సమయానికి అభ్యర్థి తప్పనిసరిగా హాజరై రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. అందులో ఏ రోజైతే కేటాయించారో అదేరోజు తప్పక హాజరుకావాలి. ఆరోజు హాజరుకాకపోతే ఇక ఎట్టి పరిస్థితిలోనూ ర్యాలీలో పాల్గొనడానికి అనుమతించరు.

వసతి, భోజన ఏర్పాట్లు సిద్ధం

ర్యాలీలో పాల్గొనేందుకు దూర ప్రాంతాల నుంచి ముందుగా వచ్చే అభ్యర్థులకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. వీరు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా గుడారాలు వేశారు. వాటిల్లో సేదతీరి ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొనవచ్చు. దూరం నుంచి ప్రయాణం చేసి ర్యాలీలో పాల్గొనే సమయానికి హాజరయ్యే అభ్యర్థులు అలసటకు గురయ్యే వీలుంది. ముందుగానే వచ్చి ఇక్కడ సేద తీరి ర్యాలీలో పాల్గొనవచ్చు. ఇదిలావుండగా కొంతమంది అభ్యర్థులకు అర్ధరాత్రి సమయంలో ర్యాలీ కేటాయించినట్లు తెలిసింది. అలాంటి అభ్యర్థులు ముందురోజు రాత్రికే కడప చేరుకోవడం ఉత్తమం. అలాంటి వారిని దృష్టిలో ఉంచుకుని భోజన వసతిని ఏర్పాటు చేశారు.

**దళారులను నమ్మి మోసపోకండి**

అత్యంత ప్రతిష్ఠాత్మకంగా కడపలో చేపడుతున్న అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇందులో పాల్గొనే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాం. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మాయమాటలు చెప్పే దళారులను నమ్మి మోసపోకండి.

\- పునీత్‌కుమార్, ఆర్మీ రిక్రూట్‌మెంట్ డైరెక్టర్

## మెయిన్ గేట్ వద్దే రిజిస్ట్రేషన్

ర్యాలీలో పాల్గొనే అభ్యర్థులు ముందస్తుగా వారి తాలూకు వివరాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంది. ఈ ప్రక్రియను డీఎస్‌ఏ మైదానం మెయిన్ గేట్ కుడివైపున ఉన్న వాటర్ ట్యాంక్ సమీపంలో చేయనున్నారు. తదుపరి ఆర్మీ అధికారుల సూచనలను పాటించాల్సి ఉంటుంది.

## ఇండోర్ స్టేడియంలో మెడికల్ టెస్ట్

ఆర్మీ ర్యాలీలో నిర్వహించిన అన్ని పరీక్షలలో విజయవంతంగా ఉత్తీర్ణులైన అభ్యర్థులకు అక్కడే ఉన్న ఇండోర్ స్టేడియంలో మెడికల్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా ర్యాలీలో పాల్గొనే అభ్యర్థులు ఏదేని అస్వస్థతకు గురైనా, లేదా గాయాలపాలైనా అక్కడే ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో సేవలందిస్తారు.

## ర్యాలీలో పాల్గొనే అభ్యర్థులకు బస ఏర్పాటు

ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనే అభ్యర్థుల సౌకర్యం కోసం కలెక్టరు శ్రీధర్ ఆదేశాల మేరకు శంకరాపురం వద్ద ఉన్న స్కౌట్ హాలులో బస ఏర్పాటు చేశామని నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.





రిక్రూట్‌మెంట్ ర్యాలీ కోసం డీఎస్‌ఏ స్టేడియంలో చేపట్టిన ఏర్పాట్లు, ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆర్మీ అధికారులు

# చేనేత కార్మికుడి ఆత్మహత్య

మదనపల్లె అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నీరుగట్టువారి పల్లెలోని మారుతీనగర్‌లో ఉంటున్న చేనేత కార్మికుడు తాను నేసే చేనేత మగ్గానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాల మేరకు సత్యసాయి జిల్లా సోమందేపల్లెకి చెందిన సి.హరి (45) కొన్నేళ్లుగా మదనపల్లెకు వలసవచ్చి నీరుగట్టు వారిపల్లెలో చేనేత మగ్గాల యాజమాని వద్ద కూలీ మగ్గం నేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో జీవితంపై విరక్తి చెంది తాను నేసే మగ్గానికే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు, ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి కొడుకు చరణ్ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతుడు హరి (ఫైల్)

# ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

● చెరువును పరిశీలించిన తహసీల్దార్

గుర్రంకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తరిగొండ రామానాయునిచెరువులో ఇసుకను టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లతో అక్రమంగా తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తామని శనివారం తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆంధ్రజ్యోతిలో 'రెచ్చిపోతున్న ఇసుక మాఫియా' అన్న శీర్షిక ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన తహసీల్దార్ రామానాయుని చెరువులో ఇసుక తవ్వకాలను పరిశీలించారు.

చెరువులో ఇసుక కోసం ఇసుకాసురులు ఎక్స్‌కవేటర్లతో తవ్విన ఇసుక గుంతలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామానాయుని చెరువులో ఇసుకను ప్రజలు, స్థానికులు తమ వ్యక్తిగత అవసరాల కోసం మాత్రమే తోలుకోవాలన్నారు. అలాకాకుండా ఎక్స్‌కవేటర్లు పెట్టి టిప్పర్లతో ఇసుకను బయట ప్రాంతాలకు తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఇందుకోసం ప్రతిరోజూ వీఆర్‌ఏను చెరువు వద్ద కాపలాగా ఉంచుతున్నట్లు తెలిపారు. ఇసుకాసురుల అగడాలను ఉపేక్షించమని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు భరత్, సిబ్బంది పాల్గొన్నారు.


చెరువులో ఇసుక గుంతలను పరిశీలిస్తున్న తహశీల్దార్

## ఆస్పత్రి నుంచి విద్యార్థులు డిశ్చార్జి

### వైద్య ఖర్చులకు ఎమ్మెల్యే ఆది ఆర్థిక సహాయం



ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అవుతున్న వర్షిణి

కొండాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాముకాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొండాపురం గురుకుల పాఠశాల విద్యార్థినులు శనివారం సాయంత్రం డిశ్చార్జి అయినట్లు ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి తెలిపారు. సోమవారం తెల్లవారుజామున గదిలో నిద్రిస్తున్న వర్షిణి, పల్లవి పాముకాటుకు గురైన సంగతి తెలిసిందే. వర్షిణిని ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించగా, పల్లవిని కడప రిమ్స్‌లో చేర్చారు. వర్షిణి పరిస్థితి కొంత సీరియస్‌గా ఉండడంతో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. విద్యార్థుల తల్లి దండ్రులకు ధైర్యం చెప్పారు. వైద్య ఖర్చుల నిమిత్తం తక్షణమే రూ.50 వేలు అందించి మిగిలిన డబ్బు కూడా చెల్లిస్తానని తెలిపారు. ఆరు రోజుల చికిత్స అనంతరం కోలుకోవడంతో ఇద్దరు విద్యార్థులను శనివారం సాయింత్రం వైద్యులు డిశ్చార్జి చేశారు. ఆరు రోజల పాటు వర్షిణి దగ్గరే ప్రిన్సిపాల్ ఉండి పర్యవేక్షించినట్లు తెలిపారు. విద్యార్థులు క్షేమంగా బయటపడటానికి సహకరించిన ఎమ్మెల్యేకి విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రిన్సిపాల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తే అవమానిస్తారా

### - టీడీపీ నేత హరిప్రసాద్



విలేకరులతో మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే ఎమ్మెల్యేను అవమానిస్తారా అంటూ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మేయరు మహిళలను కించపరిచేలా వ్యవహరించారన్నారు. కొత్తగా ప్రొటోకాల్ డ్రామాకు తెరలేపారన్నారు. గతంలో వైసీపీ ఎమ్మెల్యేలను పక్కన కూర్చోబెట్టుకుని ఇప్పుడు ప్రొటోకాల్ అనడం ఏమిటని ప్రశ్నించారు. వైసీపీలో ఒక పెద్దమనిషి ఎన్నికల్లో డబ్బు తీసుకున్నాడని చెబితే మేయరు ఎందుకు దేవుని కడపలో ప్రమాణం చేశారని ప్రశ్నించారు. సమావేశంలో అఖిలపక్షం నేతలు శ్రీనివాసులు, ప్రసాద్, సుబ్బారెడ్డి, రాంప్రసాద్ పాల్గొన్నారు.

## కన్నుల పండువగా శ్రీవారి కల్యాణం



శ్రీవారి కల్యాణం దృశ్యం

కడప కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రవణ నక్షత్రం పురస్కరించుకుని తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవుని కడపలో వెలసిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. తిరుమలేసుడు శ్రీదేవి, భూదేవి సమేతుడై కొలువుదీరి అత్యంత సుందరాకారుడుగా భక్తులకు దర్శనమిచ్చారు. కాగా కళ్యాణం సందర్భంగా చెన్నై నివాసి జె. ప్రసన్న వెంకటేశ్వరరావు స్వామివారికి సుమారు 92,280 రూపాయల విలువైన ఒక కేజీ నలభై గ్రాముల వెండి వస్తువులు.(నాలుగు తీర్థపు గిన్నెలుగా మరో నాలుగు ఉద్ధరిని) బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, అర్చకులు క్రష్ణమోహన్, త్రివిక్రమ్, సాయి, తరుణ్, భక్తులు స్వామివారి కల్యాణం తిలకించారు.

## ఎస్టీయూ నేత బాల మల్లారెడ్డి మృతి



కడప ఎడ్యుకేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సుపరిచితులు గాంధీనగర్ హైస్కూలు హిందీ ఉపాధ్యాయుడు, ఎస్టీయూ ఉద్యమ నేత బాలమల్లారెడ్డి శనివారం మృతి చెందారు. 30 ఏళ్ల హిందీ పండితుడు, కడప నగ రం ఎర్రముక్కపల్లె వాసిగా గత తరం విద్యార్థినీ విద్యార్థుల కు చక్కని విద్యాబోధన చేశారన్నారు. కఠినమైన హిందీభాషను సరళంగా నేర్పిన ఉత్తమ గురువు, తోటి ఉపాధ్యాయులకు హితైషిగా పేరు పొందారన్నారు. శనివారం ఆయన అ నారోగ్య కారణంగా వల్ల స్వర్గస్తులయ్యారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ అటు ఉపాధ్యాయునిగా ఎస్టీయూ సంఘం బాధ్యుడిగా ఆయన పనితీరు గుర్తు చేసుకుంటూ ఎస్టీయూ సంఘం, ఉపాధ్యాయ మిత్రుల తరపున ఆయనకు అశ్రునివాళులర్పిస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని శిష్యబృందం కొరివి చంద్రశేఖర్, హరినాథ్‌రెడ్డి, తిరుపతి సీఐ శ్రీకాంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు తొండూరు మండలం అగడూరులో అంత్యక్రి యలు నిర్వహిస్తున్నట్లు శిష్యబృందం తెలిపింది.

## చోరీకి వెళితే కాలు కోల్పోయింది...



చికిత్స పొందుతున్న ఇమామ్ హుస్సేన్

జమ్మలమడుగు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెన్నానది ఒడ్డున ఓ సత్రం వద్ద గరండాలను చోరీ చేసేందుకు శనివారం సాయంత్రం వెళ్లి గరండాలు మీదపడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్లితే... గడ్డవీధి వాసులు ఇమామ్ హుస్సేన్, తలారి బుజ్జి మద్యానికి బానిసలయ్యారు. ఈ క్రమంలో పెన్నానది ఒడ్డున సత్రం గరండాలు చోరీ చేసేందుకు మద్యం మత్తులోనే వెళ్లి అక్కడున్న పిల్లర్స్‌ను గడ్డపారతో తొలగించే ప్రయత్నం చేశారు. దీంతో గరండ మీదపడి ఇమామ్‌హుస్సేన్‌కు కుడికాలు తెగింది. ఘటన స్థలంలోనే పడిపోయాడు. ఎడమచెయ్యి విరిగింది. బుజ్జికి కుడి మోకాలుకు రక్తగాయం కాగా ఎడమకాలు విరిగింది. గాయపడిన వారిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఒకరిని కడప రిమ్స్‌కు మరొకరిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఘటన జరిగిన ప్రాంతాన్ని జమ్మలమడుగు అర్బన్ పోలీసులు సందర్శించి పరిశీలించారు.

## హత్య కేసులో ఇద్దరి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ

రైల్వేకోడూరు(రూరల్), నవంబరు 9:(ఆంధ్రజ్యోతి): తన తల్లిని దూషించాడన్న కోపంతో 6న వెంకటనారాయణను హత్య చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు రైల్వే కోడూరు సీఐ హేమసుందరరావు తెలిపారు. వివరాల్లోకెళితే... కోడూరు వాసి వెంకటనారాయణ ఫ్లోరింగ్ పనులు చేస్తుంటాడు. రెండేళ్లుగా అస్గర్ అలీ ఇంటిని బాడుగకు తీసుకుని అందులో సామగ్రి నిల్వ ఉంచేవాడు. ఇంటి అద్దె విషయంలో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఒకసారి వెంకటనారాయణ ఇంటి యజమాని తల్లిని దూషించాడు. కాగా ఫిబ్రవరిలో పనుల నిమిత్తం అనంత పురానికి వెళ్లిన అతను ఈ నెల 5న కోడూరుకు వస్తున్నట్లు తెలుసుకున్న అస్గర్ అలీ తన మిత్రుడు సునీల్ తేజతో కలసి అతన్ని చంపేందుకు పథకం రచించాడు. కోడూరుకు వచ్చిన వెంకటనారాయణకు ఫోన్ చేసి మద్యం తాగేందుకు ఆహ్వానిం చాడు. అతనితో కలసి రెడ్డివారిపల్లె పంచాయతీ చోడవరం చెరువు కట్టపైకి వెళ్లి మ ద్యం తాగుతుండగా మెడపై కత్తితో దాడి చేసి చంపినట్లు సీఐ వివరించారు. ఈ కేసులో నిందితులను శనివారం ఎక్సైజ్ కార్యాలయం వద్ద అదుపు లోకి తీసుకుని బైకు, కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కోడూరు అర్బన్ సీఐ హేమసుందర రావు, ఎస్ఐ నవీన్ కుమార్ సిబ్బంది రాజేంద్ర స్వామి, బాలాజీ, ఆకేఫ్, రాజును ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, డీఎస్పీ సుధాకర్ అభినందించారు.

# తరు విలాపం



**చెట్లు నరకడం వినాశనమే ● తరగిపోతున్న వృక్షసంపద**

**నాటుడు కంటే నరుకుడే ఎక్కువ ● ఎవరికీ పట్టని వాల్టా**

బద్వేలుటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'ఎందరికో నీడ, ఫలాలు, కొయ్య, ఇంటికి అవసరమయ్యే పరికరాలను అందిస్తూ ఎంతో పచ్చగా ఉండే నన్ను నరకడం మానవ వినాశనానికి హేతువు. విశ్వానికి వెలుగు దివ్వెగా నిలిచి ప్రాణవాయువును అందిస్తూ మానవాళిని రక్షించే ఏకైక సాధనాన్ని. నా ఆగమనం. చల్లని మేఘాలకు తీపికబురు నా శ్వాస.... సుతిమెత్తని నాస్పర్శతోనే వరుణుడు పరవశమవుతాడు. నా తనువుచాటున భూమాత చల్లగా పవళిస్తుంది. సకల జనుల సుభిక్షానికి నా మనుగడే ప్రధానం. అలాంటి నాకే నిలువనీడలేకుండా చేశారు. మారణాయుధాలతో నన్ను ఖండఖండాలుగా నరికేస్తున్నారు. నేలేని ప్ర పంచమే శూన్యం.. అంటూ ఓ తరువు తరుముకొస్తున్న ప్రళయాన్ని చెబుతూ రక్తకన్నీటిని నేలరాలుస్తోంది.



బద్వేలు హైవేపై చెట్లను నరికేస్తున్న దృశ్యం

ప్రకృతి ప్రకోపానికి మానవాళి అంతమయ్యే ఘడియలు దగ్గరలోనే ఉన్నాయనిపిస్తుంది. జిల్లా వ్యాప్తంగా చుక్కనీరులేక, నిలువనీడలేక నిప్పులకుంపటి నడుమ మండిపోతున్నా మనిషి మారడంలేదు. ధనాపేక్షే ధ్యేయంగా స్వార్థానికి పచ్చనిచెట్లను కొందరు నరికి సొమ్ము చేసుకుంటున్నారు. కరువు నిలయమైన ప్రాంతాల్లో అధికంగా మొక్కలు పెంచాల్సింది పోయి ఉన్నవాటినే నేలకూల్చుతున్నారు.

వాతావరణ సమతుల్యతను కాపాడే క్రమంలో ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు అనుగుణంగా ప్రజలు అధికారుల్లో చిత శుద్ధి ఉంటే ప్రభుత్వం ఆశించిన ఆశయం సఫలమవుతుంది. కళ్లముందే భయాందోళనలు కన్పిస్తున్నా ఎవరికి వారు మిన్నకుంటున్నారు. నీరు, చెట్టు, నేల పరిరక్షణ కోసం 2002లో ప్రవేశపెటిన వాల్టాచట్టాన్ని కొందరు స్వార్థపరులు ఉల్లావల్లా చేస్తున్నారు. ప్రకృతి ప్రసాదిత వనసంపద కనుమరుగైపోతోంది. స్వార్థంతో పచ్చనిచెట్లను నరికేస్తుండడంతో సకాలంలో వర్షాలు కురవక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఐదేళ్లగా సాధారణం కంటే తక్కువ శాతం వర్షాలు కురవడంతో రైతులు కరువుతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. సకాలంలో వర్షాలు కుర వకపోవడానికి కారణం అడవుల పట్ల నిర్లక్ష్యం వహించడం, కాపాడుకోలేక పోవడమేనని తెలిసినా ఇష్టానుసారంగా అటవీ ప్రాంతాల్లో, రహదారుల పక్కన, పట్టా భూముల్లో యథేచ్ఛగా పచ్చని చెట్లను నరికేస్తున్నారు. పట్టా ఉన్నా, అనుమతులు తీసుకోవాలన్న నిబంధనలు ఉన్నా, ఇవేమీ పట్టించుకోకుండా చెట్లను నరికి విక్రయిస్తున్నారు. అటవీశాఖ అధికారులు పట్టించుకోక పోవడంతోనే పచ్చనిచెట్ల నేలకొరుగుతున్నాయి. చాలా ప్రాంతాల్లో మొక్కలను నాటి తరువాత వదిలేయడంతో రక్షణ కరువై నిట్టని ఉవునా మొక్కలు ఎండిపోతున్నాయి. ఇన్ని లక్షల మొక్కలు నాటామని అధికారులు లెక్కలు చెప్పడమే తప్ప, నాటిన మొక్క లను ఎన్నింటిని సంరక్షించారన్న మాటలకు అధికారుల్లో సమాధానం లేదు. ఇప్పటికైనా అధికారులు మొక్కలను సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటే మంచిది.

### నాటుడు కంటే నరుకుడే ఎక్కువ

ఏడాదికి ఏడాది అటవీ విస్తీర్ణం తగ్గిపోతోంది. జిల్లా వ్యాప్తంగా కొన్ని మండలాల నుంచి కలప అక్రమరవాణాకు అడ్డుకట్ట వేయడంలో ఫారెస్ట్ అధికారులు అడ్డుకట్ట వేయకపోవడంతో ఆయా ప్రాంతాల నుంచి వంట చెరుకు, ఇటుకల బట్టీలకు, బొగ్గుల తయారీకి, నివాసగృహా ల కలపకు ట్రాక్టర్ల, లారీల నుంచి వృక్షసంపద తరలిపో తోంది. ఇప్పటికైనా ఫారెస్ట్ అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లారీల్లో తరలివెళుతున్న వృక్షసంపద



## 9 మందికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా నుంచి 9 మందిని రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యా అవార్డులకు విద్యాశాఖ ఎంపిక చేసింది. విశేష ప్రతి భ కనబరిచిన ఉపాధ్యాయులను సోమవారం మంగళగిరిలో సత్కరించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబరు 5న జరగాల్సిన గురుపూజోత్సవాన్ని విజయవాడ వరదల కారణంగా ప్రభుత్వం వాయిదా వేసింది. అయితే ఈ వేడుకలు సోమవారం విజయవాడ ఎక్సకన్వెన్షన్ సెంటరులో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ హాజరై అవార్డులను అందజేయనున్నారు

### ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు పాఠశాల విద్యకు సంబంధించి ప్రొద్దుటూరు మోడంపల్లె మున్సిపల్ హైస్కూలు బయాలజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు కొండారెడ్డి ఎంపికయ్యారు.

### కళాశాలల విభాగంలో

జూనియర్ కళాశాల విభాగంలో జమ్మలమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాల, బోటనీ అధ్యాపకుడు వెంకటక్రిష్ణయ్య ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికయ్యారు. టెక్నికల్ విభాగంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల సివిల్ ఇంజనీరు అధ్యాపకులు మహేశ్ ఎంపికయ్యారు. డిగ్రీకళాశాల విభాగంలో కడప ప్రభుత్వ పురుషుల కళాశాల అధ్యాపకులు డాక్టర్ సయ్యద్ వసూరుల్లాషక్తీయారి, డాక్టర్ నీలయ్య, కడప ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ జి.విజయలక్ష్మిదేవి ఉత్తమ అధ్యాపకులుగాఎంపికయ్యారు. యూనివర్శిటీ విభాగం నుంచి వైవీయూ ప్రొఫెసర్ విజయభారతి, ప్రొఫెసరు ఎల్.వీరాంజేయరెడ్డి, ప్రొఫెసర్ ఎం. అనిత ఎంపికయ్యారు.

## ఆటో, బైక్ ఢీ - ఇద్దరికి తీవ్ర గాయాలు





గాయపడిన రైతు పెద్దరెడ్డప్ప, కాంతారావు

తంబళ్లపల్లె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆటో, బైక్ ఢీకొనడంతో ఇద్దరు రైతులు తీవ్రంగా గాయపడ్డారు. తంబళ్లపల్లె మండలం గోపిదిన్నె కస్బా వాసులు కాంతారావు, పెద్దరెడ్డెప్ప పొలం పనులు ముగించుకుని శనివారం ఉదయం బైక్‌లో ఇంటికి బయలుదేరారు. ములకలచెరువు నుంచి కూలీలతో ఉప్పులూరివాండ్లపల్లెకు వెళుతున్న ఆటో గోపిదిన్నె క్రాస్ వద్ద బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో పెద్దరెడ్డెప్ప, కాంతారావు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించారు.

## 50 కిలోల గంజాయి స్వాధీనం

చిట్వేలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనుంపల్లె చెక్‌పోస్టు వద్ద 50 కిలోల గంజాయి, కారును స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు తెలియజేశారు. శనివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. గంజాయి రవాణాపై సమాచారం అందడంతో తహసీల్దారు మోహనకృష్ణ, ఓబులవారిపల్లె ఎస్ఐ మహేశ్, చిట్వేలి ఎస్ఐ రఘు రాం, సిబ్బందితో కలిసి చెక్‌పోస్టు వద్ద నిఘా ఉంచారు. రాపూరు నుంచి చిట్వేలి వైపు వస్తున్న కారు ఆపకుండా వెళ్లిపోవడంతో వెంబడించి పట్టుకున్నామన్నారు. కారులో 50 కిలోల గంజా యి పట్టుబడిందన్నారు. శ్రీకాళహస్తికి చెందిన సాయి చైతన్య కారుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడిని శనివారం రాజంపేట కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

## నలుగురు దొంగలు అరెస్ట్

చిట్వేలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దొంగతనాలకు పాల్పడుతు న్న నలుగురిని శనివారం అదుపులోకి తీసుకున్నట్టు రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు తెలియజేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ చర్చి సమీపంలో దుండగులు గత నెల 21న తనను బెదిరించి మెడ లోని బంగారు గొలుసును లాక్కెళ్లారని ఈ నెల 5న ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన ఎస్ఐ రఘురాం శనివారం బైక్‌పై వెళుతున్న నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా అనంతపురం జిల్లా గుంతకల్లు వాసులు ఏఎం మోసిన్, షేక్ హైదర్ అలీ, సయ్యద్ రసిక్యూ హుస్సేన్ అజీజ్, జాఫ్రి అలీ రాజా అజీజ్‌గా తేలిందన్నారు. వీరి నుంచి 16 గ్రాముల బంగారు చైను, మోటారుబైకును స్వాధీనం చేసుకుని రాజంపేట కోర్టుకు హాజరుపరిచామని సీఐ వెంకటేశ్వర్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రఘురాం, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎర్రచందనం దుంగలు పట్టివేత

రైల్వేకోడూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కారులో తరలిస్తున్న ఆరు ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కడప సబ్ కంట్రోల్ ఆర్ఐ చిరంజీవులు, ఆర్ఎస్ఐ పి.నరేష్, ఎఫ్‌బీఓ నాగేశ్వర్‌నాయక్, సిబ్బంది శనివారం తిరుపతి-కడప జాతీయ రహదారిలోని ఎం.బావి వద్ద వాహనాలను తనిఖీలో ఇద్దరు కారు దిగి పారిపోయేందుకు ప్రయత్నించారు. టాస్క్‌ఫోర్సు బృందం వారిని వెంటాడి ఒకరిని అదుపులోకి తీసుకుంది. విచారణలో నిందితుడు ఒంటిమిట్టకు చెందిన వాడిగా తేలింది. 6 ఎర్రచందనం దుంగలు, కారును స్వాధీనం చేసుకుని తిరుపతి టాస్క్‌ఫోర్సు కార్యాలయానికి తరలించారు. అతడిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్ రఫీ తెలిపారు.

## మద్యం మత్తులో పోలీసుపై దాడి

కురబలకోట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో పోలీసులపై దాడి చేసిన సంఘటన మండలంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ముదివేడు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ శుక్రవారం విధులు నిర్వహిస్తున్నాడు. కాగా విధుల్లో భాగంగా అంగళ్ళు కదిరిరోడ్డులో హాస్టల్స్ సమీపంలో కొంచీజుజీ మద్యం సేవిస్తుండగా పోలీసులు హెచ్చరించారు. దీనిపై కోపోద్రేకుజిటలైన కొందరు యువకులు మద్యం మత్తులో వేకువజామున అంగళ్ళు ఓపీలో ఉన్న కానిస్టేబుల్‌పై దాడి చేశారు. దీంతో ఆయన ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేశారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# ఆ కాలనీలో అన్నీ సమస్యలే..

**●కనీసం కాలువలు, రోడ్లకు నోచుకోని జగనన్న కాలనీ ● అవస్థలు పడుతున్న లబ్ధిదారులు**



జగనన్న కాలనీలో అసంపూర్తిగా నిలిచిన నిర్మాణాలు



వాల్మీకిపురం పట్టణంలోని జగనన్న కాలనీలో సీసీరోడ్లు, కాలువలకు నోచుకోని నివాసాలు

వాల్మీకిపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సమస్యలకు నిలయం.. జగనన్న కాలనీ. ఇక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకోవాలన్న కనీస సౌకర్యాలైన రోడ్డులేక లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. వాల్మీకిపురం పట్టణంలో 2020లో నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా మంజూరు చేసిన వైఎస్ఆర్ జగనన్న కాలనీ నేటికీ పూర్తి సౌకర్యాలు కరువై కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రూ.12కోట్ల వ్యయంతో తొలుతగా 395మందికి ఆపై మరికొద్ది మందికి ఇళ్లు మంజూరయ్యాయి. ఇక అప్పటి నుంచి కొద్దిమంది లబ్ధిదారులు తమ ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలు పూర్తి చేసి కాపురాలు కూడా చేరిపోయారు. అయితే కాలనీ వాసులకు కరెంట్ సౌకర్యం, తాగునీటి కుళాయిలు ఇచ్చారే తప్ప పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పన లేదని స్థానికులు వాపోతున్నారు. కాలనీ ప్రాంతంలో సంవత్సరాలు గడుస్తున్నా సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టక పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. గతంలో పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చినపుడు సమస్యలను విన్నవిస్తే అదిగో చేస్తాం.. ఇదిగో చేస్తాం.. అంటూ హామీలు ఇచ్చి వెళ్లారే తప్ప సమస్యలు పరిష్కారం కాలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నివాసాలకు కాలువలు లేక సొంతంగా గుంతలు ఏర్పాటు చేసుకున్నామని, కాలనీ వాసులను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ ప్రాంతంలో చాలా వరకు ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండిపోవడం గమనార్హం. జగనన్న కాలనీ మంజూరు చేసిన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం భారంగా మారిందనే చెప్పాలి. ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలతో ఇంటి నిర్మాణం పూర్తికాక లబ్ధిదారులు అర్ధాంతరంగా నిలిపివేశారు. ఇసుక స్టీలు, సిమెంట్ ధరలు నిరుపేదలకు భారంగా మారాయని అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల సమీపాన నిర్మించిన జగనన్న కాలనీ మంజూరు చేసి నాలుగేళ్లు పూర్తి కావస్తున్నా సౌకర్యాల కల్పన మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలిపోయింది. ఇప్పటికైనా కాలనీ ప్రాంతంలో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

**ప్రజలకు పూర్తి వసతులు కల్పిస్తాం**

జగనన్న కాలనీలో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ శాఖల ద్వారా గతంలోనే ప్రతిపాదనలు పంపించడం జరిగింది. ప్రస్తుతం కాలనీ సమస్యలను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించడంతో పాటుగా ప్రజలకు పూర్తి స్థాయి వసతుల కల్పన దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- మనోహరరాజు, ఎంపీడీవో, వాల్మీకిపురం

## తరిగొండ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారు

గుర్రంకొండ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణప్రసాద్, కృష్ణరాజు, అనిల్, సిబ్బంది నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

## 12న మడికయ్యల శివాలయంలో రుద్రాభిషేకం

మదనపల్లె అర్బన్, నవంబరు9:(ఆంధ్రజ్యోతి) మండలంలోని చిప్పిలిగ్రామం మడికయ్యల శివాలయంలో ఈనెల 12న రుద్రాభిషేకం నిర్వ హిస్తున్నట్లు ఆలయప్రధాన అర్చకుడు విశ్వే శ్వరప్రసాద్ తెలిపారు. శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మడియ క్యల శివాలయంలోని యోగభోగేశ్వర స్వామి ఆలయంలో యోగభోగేశ్వరుడికి రుద్రాభిషేకం ఉంటుందని తెలిపారు.

## మదనపల్లె వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా బదిలీ

మదనపల్లె అర్బన్, నవంబరు9:(ఆంధ్రజ్యోతి) మదనపల్లె వన్‌టౌన్ సీఐగా పని చేస్తున్న చాం ద్‌బాషా అన్నమయ్యజిల్లా రాయచోటి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలోకి కొత్తగా సీఐగా కడప జిల్లా నం ద్యాల డీఎస్ఆర్బీలో పని చేస్తున్న కె. ఎరిసా వలిని నియమిస్తూ కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం విడుదల చేసి న ఉత్తర్వులో పేర్కొన్నారు. త్వరలో మదనపల్లె వన్‌టౌన్ సీఐగా బాధ్యతలు చేపట్టానున్నారు.

## సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

మదనపల్లె టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు వేగంగా జరగాలంటే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపా ధ్యక్షుడు మోడెం సిద్దప్ప పేర్కొన్నారు. నియోజకవర్గం లోనే అం దరికంటే నీరుగట్టువారిపల్లె టీడీపీ సభ్యత్వంలో ముందుండాలని ఆయన పేర్కొన్నారు. శనివారం స్థానిక నీరుగట్టువారిపల్లెలో సిద్దప్ప ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్ర మం నిర్వహించారు. టీడీపీ అమలు చేస్తున్న సం క్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు, సభ్యత్వం తీసుకుంటే కల్పించే ఉప యోగాల గురించి వివరించారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ సీనియర్ నాయకులు నీలకంఠ, కమలమ్మ్రి కృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గట్టులో పిచ్చికుక్క వీరంగం..పలువురికి గాయాలు

బి.కొత్తకోట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : బి.కొత్తకోట మండలంలోని గట్టు పంచాయతీ పరిధిలో శనివారం ఉదయం ఓ పిచ్చికుక్క వీరంగం చేసింది. తనకు అడ్డు వచ్చిన వారినల్లా కరుచుకుంటూ పోయింది. దీంతో పలువురు గాయపడ్డారు. కొందరు బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రికి, మరికొందరు స్థానికంగా ఉన్న వైద్యుల దగ్గర చికిత్సలు చేయించుకున్నారు. పిచ్చికుక్క ధాటికి గాయపడిన వారిలో గుట్టపాలెంకు చెందిన వెంకట్రమణారెడ్డి, పత్రవారిపల్లెకు చెందిన మోహన్‌రెడ్డి, పెద్ద భయ్యారెడ్డి, శకుంతల, నారాయణస్వామిలతో పాటు పొలంలో పనులు చేసుకుంటున్న శ్వేత, అమర, గంగాధర్, మస్తాన్, నరసింహులు, మద్దిలేటిలు ఉన్నారు. బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రికి వచ్చిన బాధితులకు వైద్య సిబ్బంది అవసరమైన వైద్యం అందించారు. పలువురిని కాటేసిన అనంతరం శనివారం సాయంత్రం ఆ పిచ్చికుక్కను గ్రామస్థులు కొట్టి చంపారు.

## ఇసుక అక్రమ రవాణాపై కేసు నమోదు

**●ఎక్స్‌కవేటర్, మూడు ట్రాక్టర్లు సీజ్**



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లు

కలకడ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి):మండలంలోని నవాబ్‌పేట చెరువు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసి మూడు ట్రాక్టర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. . ఈ దాడుల్లో ఎక్స్‌కవేటర్‌తో పాటు ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామానికి చెందిన ఎక్స్‌కవేటర్ యజమాని ఆంజినేయులు, ట్రాక్టర్ యజమాని పద్మనాభనాయుడు, గుర్రంకొండకు చెందిన మరో ఇద్దరు ట్రాక్టర్ డ్రైవర్లు సుధాకర్, జయచంద్రలను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గత సెప్టెంబరు 21న ఈ ప్రాంతంలో పోలీసులు దాడులు చేసి ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. అయిన అక్రమార్కులు పట్టించుకోకపోవడం కొసమెరుపు. కాగా కలకడ మండలంలో పెద్ద చెరు వులో ఒకటైన నవాబ్‌పేట చెరువులో అపారంగా ఇసుక మేటలున్నాయి. ఇదే అదునుగా నాయకులు కొందరు రాజకీయ పలుకుబడితో కొంతకాలంగా ఇష్టానుసారంగా అక్రమ ఇసుక దందాను నడిపిస్తున్నారు. ఇలా ప్రతి రోజు మండలంలోని పలుగ్రామాలకు పొరుగునే ఉన్న గుర్రంకొండకు నిత్యం ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో పోలీసులకు సమాచారం రావడంతో దాడులు నిర్వహించారు

## కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



వ్యక్తి అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

మదనపల్లె టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలి స్తున్న వ్యక్తిని మదనపల్లె ఎక్సై జ్ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం బి.కొత్తకోట మండలం కాండ్లమడుగు క్రాస్ వద్ద ఎక్సైజ్ పోలీసులు, బీఎం పీపీ సంయుక్తంగా వాహనాలు తనిఖీ చేస్తుండగా, కర్ణాటక రాష్ట్రం లక్ష్మీపురంకు చెందిన శ్రీనాథ్(40) ద్విచక్రవాహనంలో 48 టెట్రాప్యాకెట్ల కర్ణాటక మద్యం తరలిస్తుండగా అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. నిందితుడి ద్విచక్రవాహనం సీజ్ చేసి, రిమాండ్ నిమిత్తం శ్రీనాథ్‌ను కోర్టుకు తరలించామన్నారు.

## శనేశ్వరస్వామికి మహాతైలాభిషేకం



విశేష పూజలందుకుంటున్న శనేశ్వరస్వామి

వాల్మీకిపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి):వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం సమూలాహాలయంలో శనివారం శనేశ్వరస్వామికి వైభవంగా మహా తైలాభిషేకం నిర్వహించారు. షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆలయంలోని శనేశ్వరస్వామికి ఉదయం పాలు, పసుపు, కుంకుమ, చందనం, జలాభిషేకాలు జరిగాయి. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఏకవార మహా తైలాభిషేకం నిర్వహించారు. చివరగా స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు చేశారు. మృత్యుంజయ హోమాది కార్యక్రమాలు గావించి భక్తులకు తీర్థప్రసాద పంపిణీ, అన్న వితరణ చేపట్టారు. ట్రస్టు వ్యవస్థాపకుడు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## జీవనోపాధులు పెంచేలా పనులు గుర్తించాలి



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో తాజ్‌మస్రూర్

మదనపల్లె టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజల జీవనోపాధులు పెంచేలా అభివృద్ధి పనులను గుర్తించాలని ఎంపీడీవో తాజ్‌మస్రూర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక సీఎల్ఆర్సీ భవనంలో డివిజన్‌లోని ఎంపీడీవోలు, ఈవోఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులకు రెండో శిక్షణ శిబిరం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను పంచాయతీ కార్యదర్శులు గుర్తించి ఈ పనులన్నింటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తేనే 16వ ఆర్థిక సంఘం నిధులు మంజూరవుతాయన్నారు. నిర్లక్ష్యం చేస్తే నిధులు కోల్పోతామన్నారు. కార్యక్రమంలో అబ్బర్వర్ ప్రసాద్, డీఎల్‌డీవోలు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## డ్వాక్రా సంఘాల సభ్యుల వివరాలు పొందుపరచాలి

తంబళ్లపల్లె, నవంబరు 9(ఆంధ్రజ్యో తి) : పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వ ర్యంలో చేపట్టిన ఎస్‌హెచ్‌జీ ఇన్‌కం ప్రొఫైలింగ్ యాప్‌లో డ్వాక్రా మహిళా సంఘాల సభ్యుల పూర్తి సమాచా రాన్ని పొందుపరచాలని వెలుగు ఏపీఎం గంగాధర్ తెలిపారు. శనివా రం స్థానిక వెలుగు కార్యాలయంలో ఎస్ హెచ్‌జీ ఇన్‌కం ప్రొఫైలింగ్ యాప్ నిర్వహణపై సీసీలు, సంఘమిత్రలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ.. సంఘ మిత్రలు ఎస్‌హెచ్‌జీ ఇన్‌కం ప్రొఫైలింగ్ యాప్‌లో ప్రతి గ్రూపు సభ్యురాలి పూర్తి సమాచారం, సభ్యురాలి కుటుంబంలోని సభ్యుల వివరాలు, ఖచ్చితంగా తప్పులు లేకుండా సేకరించాలని సూచించారు. ఈ నెల 16వ తేదీ వరకు సీసీలు, సంఘ మిత్రలు, ప్రతి ఇంటికి వెళ్లి సమగ్ర సమాచారాన్ని సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మీ, సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

## వాల్మీకుల వర్క్‌షాపును జయప్రదం చేయండి

రామసముద్రం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడం కోసం ఈనెల 15న మదనపల్లెలో జరుగు వర్క్‌షాపునకు వాల్మీకులు అందరూ కదలి రావాలని జిల్లా వాల్మీకి సంఘ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం మండలానికి విచ్చేసిన వారు మండల కేంద్రములోని వాల్మీకి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ వాల్మీకుల సమస్యల సాధన కోసం ప్రతి ఒక్క వాల్మీకి కుటుంబ సభ్యులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు నాగినేని గోవిందు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మల్లికార్జున, అన్నమయ్య జిల్లా వాల్మీకి గౌరవాధ్యక్షులు శ్రీనివాసులు, చిన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, లక్ష్మన్న, కోటికి శేఖర్, ఎం.లక్ష్మీనారాయణ, రామసముద్రం మండల ఉపాధ్యక్షుడు కదిరప్ప, సుబ్రహ్మణ్యం, రమణ, శ్రీనివాసులు, కృష్ణమూర్తి, చంద్ర, వెంకటరమణ పాల్గొన్నారు.

## పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

వాల్మీకిపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించ డం ద్వారా సంపూర్ణఆరోగ్యాన్ని పొందవచ్చని వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి పీ హెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీవిద్య పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ సంక్షేమ వస తి గృహంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భం గా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో కలుగుతున్న మార్పుల దృష్ట్యా విద్యార్థులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. వ్యాధులను నిర్లక్ష్యం చేయక ఎప్పటికప్పుడు చికిత్సలు చేయించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో హెల్త్‌ఎడ్యుకేటర్ మహ్మద్‌రఫీ, హాస్టల్ వెల్ఫేర్ అధికారిణి సలోమి, సూపర్‌వైజర్ సుధాకర్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణను ఐక్యంగా అడ్డుకుందాం



వాల్మీకిపురంలో మాట్లాడుతున్న దళిత నాయకులు

వాల్మీకిపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): దళితు లంతా ఐక్యంగా ఉంటూ ఎస్సీ వర్గీకరణను అడ్డు కోవాల్సిన అవసరం ఎం తైనా ఉందని మాల మహానాడు జిల్లా అధ్య క్షుడు శివయ్య పేర్కొ న్నారు. శనివారం వాల్మీకిపు రం పాత బస్టాండులోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత నాయకుల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అన్నదమ్ములుగా ఉన్నటువంటి మాలమాదిగల మధ్య చిచ్చు రేపడం బావ్యం కాదన్నారు. ఎస్సీ వర్గీకరణ వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగార్జున, జిల్లా కార్యదర్శి గాంధీ, సుధాకర్, మండల ఉపాధ్యక్షుడు కేవీ రమణ, నాయకులు వెంకటముని, చెక్కల రెడ్డెప్ప, సూర్యనారాయణ, నాగన్న, మధు, సుధాకర్, భాను, వేణు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

## టీడీపీ సభ్యత్వ నమోదుతో అధిక ప్రయోజనాలు



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్



మాట్లాడుతున్న టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి

ములకలచెరువు/నిమ్మనపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదుతో అధిక ప్రయోజనాలు చేకూరుతాయని మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ పేర్కొన్నారు. శనివారం నిమ్మనపల్లె మండలంలో జరుగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు ఇంటింటికి తిరిగి టీడీపీ సభ్యత్వ నమోదు చేసి సభ్యత్వం తీసుకొన్న వ్యక్తికి రూ.5లక్షలు ప్రమాద బీమా సౌకర్యం, కార్యకర్తల కుటుంబాల విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం, ఉపాధి అవకాశాలు, అనారోగ్యం పాలైతే కార్యకర్తల కుంబానికి ఆర్థిక సాయం అందిచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యశశ్విరాజ్, వెంకరమణ, మునిరత్నం, విజయ్, చెంద్రాయుడు, రాజన్న, రామచంద్ర, శ్రీనివాసులు, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా టీడీపీ సభ్యత్వ నమోదుతో ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ములకలచెరువుకు చెందిన ఆటో యూనియన్ నాయకులు స్వచ్ఛందంగా వచ్చి జయచంద్రారెడ్డి అధ్యక్షతన టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలు, నాయకుల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెద్దపీట వేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేస్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ, మాజీ వైస్ ఎంపీపీ నరసింహులు, నాయకులు భజంత్రి రామాంజులు, ఫాస్టర్ శ్రీనివాసులు, భగత్‌సింగ్ ఆటో యూనియన్ నాయకులు కట్టుబడి ఖాదర్‌బాషా, మహబూబ్ బాషా, మహమ్మద్‌రఫీ, ఖాసీం, రమణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి



ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట నిరసన తెలియచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

మదనపల్లె అర్బన్, నవంబరు9: మదనపల్లె సర్వజన బోధనాస్పత్రి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఆ సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఆ మేరకు స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట మూడో రోజు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ సర్వజన బోధనాస్పత్రి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్‌లోకి తీసుకోవాలని, ఎనిమిది నెలలుగా పెండింగ్ ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఉన్నతాధికారులు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌కు, సబ్‌క లెక్టర్‌కు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. చాలాసార్లు ఆందోళనలు చేపట్టినా సమస్యకు ఉన్నతాధికారులు పరిష్కారం చూపలేదని వాపోయారు. ఇప్పటికైన కూటమి ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు చొరవ చూపి వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉర్దూ భాషా దినోత్సవం



వాల్మీకిపురంలో మహమ్మద్‌ఇక్బాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

వాల్మీకిపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురంలో ఉర్దూ భాషా దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకు న్నారు. స్థానిక దర్గా ఆవరణలో సారేజ హాన్‌సే అచ్చా.. హిందుస్తాన్ హమారా గేయ రచయిత మహమ్మద్ ఇక్బాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనం గా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉర్దూ, పారశీ భాషలలో ఎంతో పట్టు ఉన్న మహమ్మద్‌ఇక్బాల్ సారేజహాన్‌సే అచ్చా.. హిందుస్తాన్ హమారా గేయ రచయితగా పేరు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, నాయకులు కువైట్ సయ్యద్‌బాషా, దర్గా కమిటీ అధ్యక్షుడు సందానిబాషా, సభ్యులు జబ్బార్‌సాహెబ్, మౌలానా, ఇమ్రాన్, బావాజాన్, కరీం, ఇర్ఫాన్, యువత పాల్గొన్నారు.

## ఓటరు నమోదుకు బీఎల్‌వోలు హాజరు కావాలి



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న తహసీల్దార్ ధనంజేయులు

నిమ్మనపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఓటరు నమోదు ప్రక్రియకు బీఎల్‌వోలు తప్పనిసరిగా హాజరు కావాలని లేని పక్షంలో చర్యలు తప్పవని తహసీల్దార్ ధనంజేయులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని 24బూత్‌లలోని ఓటరు జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 68 క్లైములు రాగా వాటిలో ఫారం-6 కింద కొత్త ఓటర్లు, ఫారం-7 కింద చనిపోయిన డబుల్‌ఎంట్రీలు, ఫారం-8 కింద సవరణలు వచ్చినట్లు తెలిపారు. ఆదివారం కూడా ప్రతి గ్రామంలో బీఎల్‌వోలో అందుబాటులో ఉంటారని మిగిలిన వారు ఓటరు జాబితాలో ఎటువంటి తప్పులు ఉన్నా వాటిని సరిచేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



తరిగొండలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

గుర్రంకొండ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి):మండలంలోని తరిగొండలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించగా 102 మందికి ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 42 మందిని కంటి ఆపరేషన్‌కు రెఫర్ చేశారు. అలాగే 28 మందికి కంటి అద్దాలను అందజేసి మగిలిన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రబాబు, నౌషాద్‌అలీ, హేస్సాన్, వైద్య సిబ్బంది షరేన్, యాస్మిన్, సాంబశివ, వంశీకృష్ణ, కోటయ్య, ప్రేమసాగర్‌లు పాల్గొన్నారు.

## మాదిగల ఆత్మీయ సమ్మేళన సభకు తరలిరండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెస్పీ నాయకుడు నరేంద్రబాబు

తంబళ్లపల్లె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మదనపల్లెలో ఈ నెల 14వ తేదీన నిర్వహించబోయే మాదిగల ఆత్మీయ సమ్మేళన సభకు ప్రతి మాదిగ సోదరుడు తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు నరేంద్రబాబు పిలుపునిచ్చారు. శనివారం తంబళ్లపల్లెలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్రబాబు మాట్లాడుతూ..ఎస్సీ వర్గీకరణ కోసం గత 30 ఏళ్లుగా తాము చేస్తున్న పోరాటాన్ని సుప్రీంకోర్టు గుర్తించి ఎస్సీ వర్గీకరణ చేయాలని ఈ ఏడాది ఆగస్టు 1న రాష్ట్రాలను ఆదేశించిందన్నారు. ఈ విషయమై నిర్వహించతలపెట్టిన మాదిగల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొంటారని.. ఈ సమావేశానికి ప్రతి మాదిగ సోదరుడు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గోపి మాదిగ, వేటా మల్లికార్జున, వెంకటప్ప మాదిగ పాల్గొన్నారు.

## మద్యం విక్రేత అరెస్టు

గుర్రంకొండ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి):అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు. మండలంలోని నడిమిఖండ్రిగ దళితవాడకు చెందిన గణపతి(62) మద్యం విక్రయిస్తున్నట్లు తెలియడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో నిందితుని నుంచి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# పోస్టుమార్టం కోసం పూడ్చిన శవం వెలికితీత

**●మృతిపై అనుమానం ఉందంటూ మృతురాలి సోదరుడి ఫిర్యాదు**

**● మదనపల్లెకు తరలింపు**



మృతురాలు పార్వతమ్మ

తంబళ్లపల్లె, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : పూడ్చిపెట్టిన మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు వెలికి తీసిన సంఘటన శనివారం తంబళ్లపల్లె మండలంలో చోటుచేసుకుంది. వివరాల మేరకు.. తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె పంచాయతీ చిన్నప్పరెడ్డిగారిపల్లెకు చెందిన రామచంద్ర భార్య పార్వతమ్మ(47) శుక్రవారం ఉరి వేసుకుని మృతి చెందగా శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. అయితే, అంత్యక్రియలు పూర్తైన అనంతరం మృతి అనుమానస్పదంగా ఉందని బి.కొత్తకోట మండలం అయ్యగారిపల్లెకు చెందిన మృతురాలి సోదరుడు రెడ్డప్ప తంబళ్లపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు ఎస్ఐ లోకేష్‌రెడ్డి శనివారం వీఆర్‌వో రాజగోపాల్ సమక్షంలో మృతదేహాన్ని వెలికితీసి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ లోకేష్ రెడ్డి తెలిపారు. కాగా, మృతురాలి పార్వతమ్మ కుమారుడు చంద్రశేఖర్ 2019 సంవత్సరంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుమారుడు మృతి చెందిన సంఘ టన గుర్తుకు వచ్చి బాధను భరించ లేక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబసభ్యులు తెలి పినట్లు పోలీసులకు నివేదించారు. అయితే, పార్వతమ్మ మృతి నమ్మశక్యంగా లేదని అనుమా నం ఉందని ఆమె సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పూడ్చిపెట్టిన మృతదేహాన్ని వెలికి తీసి పోస్టు మార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.